# సాక్షి
## మానవ హక్కుల నిఘా

NEWSLETTER - 20 | BI MONTHLY | FOR PRIVATE CIRCULATION ONLY | AUGUST - SEPT : 2008



# మతం మితం మించితే.....

...✍ - వి. నందగోపాల్

భారతరాజ్యాంగ పీఠికలో "భారత దేశ ప్రజలగు మేము భారతదేశమును సార్వభౌమ్య, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా మరియు ఇందలి పౌరులందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయమును, భావము, భావ ప్రకటనా స్వేచ్ఛ, విశ్వాసము, నమ్మకము, ఆరాధనా స్వేచ్ఛను, అంతస్తులోను, అవకాశములలోను సమానత్వమును మరియు వారందరిలో వ్యక్తి గౌరవమును, జాతీయ ఐక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వమును పెంపొందించుటకు ప్రమాణ పూర్వకముగా తీర్మానించుకొన్నాము. అని చెప్పబడింది.

పరాయి దేశస్తుల నుండి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందిన తరువాత మన పెద్దలు, మేధావులు ఆశించిన భావి భారత రాజ్య నిర్మాణం ఇది. దీని బాధ్యత ఈ దేశ పౌరులు ప్రతి ఒక్కరిదీ, పాలకులు ప్రతి ఒక్కరిదీ. అయితే మనం ఏ విధమైన రాజ్య నిర్మాణం వైపు ప్రయాణిస్తున్నాం

మతం పేరుతో జరుగుతున్న మారణహోమాలు కులం పేరుతో కుంచించుకుపోతున్న రాజకీయాలు, పౌరులందరి మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంచుతాయా? జాతి ఐక్యత సమగ్రతను పెంపొందిస్తాయా?

చారిత్రక పరిణామ క్రమంలో భిన్నజాతులు, మతాలు, కులాల సమాజంగా ఎదిగిన భారత దేశంలో వ్యక్తుల, సమూహాల విశ్వాసాలు, నమ్మకాలు, ఆరాధన పద్ధతుల్లోని వైవిధ్యాలు, వాటి మధ్య పరస్పర సామరస్యతా అవసరత అతి ముఖ్యమని భావించిన రాజ్యాంగ నిర్మాతలు వీటి స్వేచ్ఛను పీఠికలో వ్యక్తపరచడం ద్వారా వాటికి మనం ఇవ్వవలసిన విలువను, ప్రాముఖ్యతనూ తెలియపరిచారు. విజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందుతూ ఉందో ఆరాధనా విశ్వాసాలు నమ్మకాలు కూడ ప్రజలలో అదే స్థాయిలో బలపడుతున్నాయన్నది మనం గమనించవలసిన వాస్తవం.

ఏ కారాణంతోనైనా సరే ఒకరి విశ్వాసాల పట్ల మరొకరు క్రోధాన్ని పెంచుకోవడం, అనూహ్యదాడులతో మారణకాండలు సాగించడం, అమానవీయం, అవమానకరం, ఇది సమాజ తిరోగమనం దేశ అభివృద్ధికి వినాశకరం.

విచ్ఛిన్నకర శక్తులు ఢిల్లీ, ముంబాయి, బెంగుళూరు, హైదరాబాదు మొదలైన పట్టణాలలో బాంబుదాడులతో అనేకమందిని పొట్టన పెట్టుకొన్నా తద్వారా సమాజంలో అలజడులు సృష్టించ దలచిన వారి పథకాలకు ఏ మాత్రం చోటివ్వక సంయమనం పాటించిన గొప్పతనం ఈ దేశ ప్రజలది.

నేడు ఒరిస్సాలో కాందమాల్ జిల్లాలో మతం పేరుతో దళిత క్రైస్తవుల పై జరుగుతున్న దాడుల్లో అదే గ్రామాల్లోని ఒక వర్గం వారు మరొక వర్గం వారిపై మారణహోమాలు జరపడం, గృహదహనాలు, లూటీలు, మానభంగాలు జరపడం ఒక వినాశకర పరిణామం. రోజులు, నెలలు గడుస్తున్నా వీటిని ఆపలేని ఆ ప్రభుత్వాల చిత్తశుద్ధి ప్రశ్నార్థకం. రాజ్యాంగ విలువలను పాటించి, అమలుచేయవలసిన ప్రధాన బాధ్యత ఆయా ప్రభుత్వాలదే. ఆ బాధ్యతను విస్మరించిన ప్రభుత్వాలను సమాజం క్షమించదు. మానవ విలువలు, మానవ హక్కులు కాపాడలేని ప్రభుత్వాలు చరిత్రలో మాయని మచ్చలుగా మిగిలిపోక తప్పదు. ఒరిస్సాలో జరుగుతున్న ఈ దారుణకాండ ఇతర రాష్ట్రాలకు వ్యాపించకుండా వుండాలంటే ప్రతి ఒక్కరు వీటిని ఖండించాలి. ప్రభుత్వాలు ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇట్లు
సాక్షి

## దళిత్ కాల్ లైన్

నేటి సమాజంలో కులవ్యవస్థ వేళ్ళు పాతుకొని పోయిన సందర్భంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలు అనేక హింసలకు గురౌతున్నారు. కుల అకృత్యాలకు సాక్షులుగా ప్రత్యేకించి దళితులు, గిరిజనులు అందులోనూ స్త్రీలు మిగులుతున్నారు. అలాంటి ఘోరమైన పరిస్థితి హైటెక్ నగరమైన హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుండి ఒంగోలు వెంగముక్కల పాలెం వరకు అనేక ఘటనలు మనముందుకు వస్తున్నాయి. రాష్ట్రమంతటా ఇలాంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాక్షి మానవహక్కుల నిఘా తన బాధ్యతల్ని తాను నిర్వర్తించుకుంటూ ముందుకు వెళుతుంది. ఆ క్రమంలో ఉన్న సమాచార వ్యవస్థని మరింత విస్తృతం చేసుకోవాల్సిన అవసరం వుంది.

కావున గ్రామాల్లో వివిధ ఉద్యమాల్లో ప్రజోపయోగ కార్యక్రమాల్లో పాల్గొంటున్న సామాజిక కార్యకర్తలు ఆయా గ్రామాల్లో జరిగిన **"రేప్, మర్డర్, సాంఘిక బహిష్కరణ, సామూహిక దాడులు, ఆస్తుల విధ్వంసం, లాకప్‌మరణాలు** మొదలైన వాటి వివరాలను టోల్ ఫ్రీ నెంబర్ - 18004255535, 27737093కు తెలియజేయ వలసిందిగా కోరడమైనది.

ఇట్లు
సాక్షి మానవహక్కుల నిఘా

# ఒరిస్సాలో కందమాల్ ఎందుకు కాలుతోంది?

...✍ - కంచ ఐలయ్య

ఒరిస్సా రాష్ట్రంలో కందమల్ జిల్లాలో చర్చిలు తగలబెడుతున్నారు. స్కూళ్ళు కూలగొడుతున్నారు. అనాథ శరణాలయాలు ఆహుతి పాలవుతున్నాయి, ఆదివాసులకు ఇక్కడో, అక్కడో అందుబాటులో ఉండే హాస్పిటళ్ళు కూలగొడుతున్నారు. కొద్ది రోజుల కింద అక్కడ విశ్వహిందూ పరిషత్ అధిపతిగా పనిచేస్తున్న లక్ష్మణానంద సరస్వతిని, అతనితోపాటు మరో నలుగురిని మావోయిస్టులు కాల్చిచంపారు. ఈ హత్యలు జరిగిన మరుసటిరోజు నుండే విశ్వహిందూ పరిషత్, ఆర్.ఎస్.ఎస్, బజరంగ్‌దళ్ సంస్థలు అక్కడి ఆదివాసుల మీదపడి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆ జిల్లాలో దాదాపు 25 శాతం ఆదివాసులు, ఇతర కులాలవారు క్రైస్తవ మతస్థులయ్యారు. వారికి క్రైస్తవ మిషనరీలు స్కూళ్లు పెట్టి, హాస్పిటళ్ళు కట్టి, తల్లిదండ్రులు లేని పిల్లలకు అనాథాశ్రమాలను నడిపిస్తున్నారు. ఈ మొత్తం ప్రజాప్రయోజన కార్యక్రమాలను ఆపాలనేది సంఘ్‌పరివార్ డిమాండ్. ఈ కార్యక్రమాలే అక్కడి ప్రజలు క్రైస్తవంలోకి పోయేట్లు చేస్తున్నాయి. కనుక వాటిని ఆపమంటున్నారు.

ఈ క్రమాన్నంతా వాళ్ళు బలవంతపు క్రైస్తవమత ప్రచారంగా, డబ్బు ఆశ చూపించి చేస్తున్న మతమార్పిడి ప్రక్రియగా చూపించి ఈ మొత్తాన్ని ఆపమంటున్నారు. అసలు మావోయిస్టులు జరిపిన హత్యకు క్రైస్తవ సంస్థలకు ఏం సంబంధం? మావోయిస్టులు ఈ దేశంలో తమ వర్గశత్రువులు అనుకునే వారిని చాలాకాలంగా చంపుతూనే ఉన్నారు. అందుకు క్రైస్తవులుగా మారిన ఆదివాసులనెందుకు టార్గెట్ చెయ్యాలి? వాళ్ళ స్కూళ్ళను, హాస్పిటళ్ళను, అనాథశరణాలయాలను ఎందుకు టార్గెట్ చెయ్యాలి? కావాలంటే లక్ష్మణానందను చంపిన మావోయిస్టులతో వాళ్ళు నేరుగా యుద్ధానికి దిగొచ్చు. ఇటు హిందూ మతసంస్థలు, అటు సంఘపరివార్ సంస్థలు ఆయుధాలతో యుద్ధం చెయ్యడాన్ని నమ్మినవే. ఈ దేశంలో క్రైస్తవ మిషనరీ సంస్థలు ఆయుధాలు ధరించి శత్రువులను చంపిన సంఘటనలు అసలులేవు.

ఇదే ఒరిస్సాలో గ్రాహంస్టేన్‌ను, ఆయన ఇద్దరి పసికూనలను సజీవంగా మంటలోవేసి కాల్చిచంపినప్పుడు ఆయన భార్య ప్రపంచానికి ఇచ్చిన వాంగ్మూలం ఏమిటి? 'నా భర్తను, పిల్లల్ని చంపినవాళ్ళను చంపాలని నేను కోరుకోను. వారిని దేవుడు క్షమించాలని నేను దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను' అని ఆమె అంది. ఆ హంతకులను చట్టం ప్రకారం ఉరిశిక్ష వెయ్యాలా అని ఆమెను అడిగినప్పుడు కూడా ఆమె వారిని ఉరి తియ్యకూడదు, దేవుడు వారిని మారుస్తాడు అని చెప్పింది. మొన్నటి కందమాల్ ఘటనలో పాల్గొన్నది మావోయిస్టులు కాక, హింసావాదులైన క్రైస్తవ యువకులే అనుకుందాం! అందుకు ప్రతికూలంగా జాతీయవాదులమని చెప్పుకునే విశ్వ హిందూ పరిషత్ (అంటే ప్రపంచంలోనే హిందూయిజం వ్యాప్తి చెందాలని కోరుకునే సంస్థ) ఏం చేస్తోంది? గ్రాహంస్టేన్ భార్యలా చంపిన వారిని రక్షించమని దేవుణ్ణి కోరడంలేదు. పోనీ చంపిన వారెవరో వారిని పట్టుకొని ఉరితియ్యమని అడగడంలేదు.

అందుకు ప్రతీకారంగా, అనాథశరణాలయాలలోని చిన్నపిల్లల్ని, వారికి తిండిపెట్టే స్త్రీలను చంపుతున్నారు. ఆదివాసీ పిల్లలకోసం అరకొర జీతాలతో, ఉండీ లేని వనరులతో నడిపే స్కూళ్ళను తగలబెడుతున్నారు. గుజరాత్‌లో గోద్రా ట్రైన్‌కు నిప్పు అంటుకున్న సందర్భంగా, ముస్లిం స్త్రీల గర్భాలను కోసి పిండాలను తీసి మంటల్లో వేశారు. స్త్రీలను నడిరోడ్లమీద చెరిచారు. అన్ని టివి ఛానళ్ళ కెమెరాల ముందు నిలబడి ఒక్కొక్క వ్యక్తితో వారు స్త్రీలను ఎట్లా చెరిచింది, ఎట్లా గర్భాలను కోసింది సగర్వంగా చెప్పించారు. ఈ రోజు వాళ్ళు ఎంత మందిని చంపుతున్నారు, ఎట్లా చంపుతున్నారనే లెక్కల్ని పక్కకుపెడితే అసలు ఈ సంస్కృతిని ఏమనాలి? ఇదొక జాతీయ, మత, మానవ సంస్కృతేనా? అసలు వీరి టార్గెట్ ఆదివాసి విద్య, వారికి నేడు లభించే మానవహక్కులు, వారికి అందుబాటులోకి వస్తోంది వైద్యం.

ఈ దేశంలోని ఆదివాసి ప్రాంతాల్లో క్రైస్తవమతం ఎందుకు పాకుతోంది? చర్చి ఎందుకు పెరుగుతోంది? హిందూమతం వారిని కనీసం మానవులుగా చూసి, వారికి రావలసిన కనీస అక్షరాస్యతను రానిచ్చి ఉంటే వేరే మతాలవైపు ప్రజలు చూసేవారు కాదు.

లక్ష్మణానంద ఆ ప్రాంతంలో క్రైస్తవమతం పెరగకుండా హాస్పిటళ్ళు కట్టారు? వాళ్ళకోసం ఎన్ని ఇంగ్లీషు మీడియం స్కూళ్ళు పెట్టారు? ఈ నాటికీ బ్రాహ్మణ పూజారుల చేతుల్లో ఉన్న జగన్నాథ టెంపుల్‌లోకి ఆదివాసులను కూడా రాకుండా అడ్డుకుంటూ ఉంటే వారు వేరే మతంలోకి పోకుండా ఎందుకుండాలి? హిందూ వ్యవస్థ వేళ్ళూనుకొని ఉన్న యావత్ దేశంలో కుల వ్యవస్థను రద్దుచేసి మానవ విలువలు గల సమాజాన్ని స్థాపించే స్థితి లేనపుడు ఆదివాసులను హిందూయిజంలోకి రమ్మని అడిగితే వాళ్ళు ఎలావస్తారు? వచ్చి వాళ్ళు ఏ కులంలో చేరాలి?

మానవ విద్యను అభివృద్ధి చేయడానికి కృషి చెయ్యని మతం ఏ దేశంలోనైనా ఎంతకాలం మనగలుగుతుంది? విద్య, తిండి, బట్ట, ఇంటి వనరులు ప్రపంచంలో మత వ్యవస్థలు రూపొందాక పెరుగుకుంటూ వచ్చాయి. హిందూమతాన్ని మిగతా మతాల్లా ఒక మతంగా నిర్వచించాకనైనా అది మానవ సమానత్వంకోసం, మానవ అభివృద్ధి కోసం పనిచేయ్యడం ప్రారంభించిందా? ఆ పని చెయ్యకపోగా

(➡ తరువాయి 9వ పేజీలో ..... )

# నేతి బీరకాయలో నెయ్యి చందం - దళిత మానవ హక్కుల పరిరక్షణ

...✍ - ఎస్. దేవకుమార్

2007వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో "యూరోపియన్ కమిషన్ యూరోపియన్ ఇనీషియేటివ్ ఫర్ దళిత్ హ్యూమన్ రైట్స్" పథకం సాక్షి, మానవ హక్కుల నిఘా ద్వారా ప్రారంభమైంది. ఈ ప్రాజెక్ట్ ప్రధానంగా దళితమానవ హక్కుల ఉల్లఘనలు, దళితులపై జరిగే అత్యాచారాలు, దళితుల కోసం ఉద్దేశించిన చట్టాల అమలు తీరును అధ్యయనం చేయడం దీని ఉద్దేశం. ఇందులో భాగంగా పది జిల్లాలను ఎంచుకునిపనిచేస్తున్నది. అత్యాచారాలకు సంబంధించిన నిజనిర్ధారణ నివేదిక మరియు అధికారుల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ఈ క్రింది సమాచారాన్ని క్లుప్తంగా మీ ముందుంచుతున్నాము.

**10 జిల్లాలలోని కేసుల విశ్లేషణ - ఫిబ్రవరి 07-ఆగస్టు08 దళితులపై జరిగే వివిధ రకాలైనటువంటి నేరాలు**

| క్ర. సం. | జిల్లా | మొత్తం నేరాలు | హత్య | హత్యా యత్నం | అత్యాచారం | అత్యాచార యత్నం | దాడికుల దూషణ | కులదూషణ | స్త్రీలను అమ్మడం | ఆత్మహత్యకు ప్రోత్సహించుట | అనుమానాస్పద మృతి | ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1. | రంగారెడ్డి | 23 | 6 | | 3 | 2 | 5 | 4 | 1 | - | - | 2 |
| 2. | నల్గొండ | 21 | 4 | - | 6 | 1 | 5 | 1 | 1 | 1 | - | 2 |
| 3. | గుంటూరు | 19 | 1 | - | 3 | 1 | 9 | 1 | - | - | 2 | 2 |
| 4. | కడప | 13 | - | 2 | 3 | 2 | 3 | - | | 2 | - | 1 |
| 5. | మహబూబ్‌నగర్ | 12 | 2 | 1 | 3 | - | 1 | 4 | - | - | 1 | - |
| 6. | చిత్తూరు | 10 | 2 | - | - | 1 | 6 | - | - | 1 | - | - |
| 7. | విశాఖపట్నం | 9 | 1 | - | 2 | 1 | 1 | 4 | - | - | - | - |
| 8. | ప్రకాశం | 7 | - | - | 1 | 1 | 4 | 1 | - | - | - | - |
| 9. | విజయనగరం | 5 | 2 | - | - | 2 | 2 | 1 | - | - | - | - |
| 10. | వరంగల్ | 5 | - | - | 1 | - | 2 | 1 | - | - | - | - |
| | **మొత్తం** | **126** | **18** | **3** | **22** | **11** | **38** | **17** | **2** | **4** | **3** | **7** |
| | శాతం | | 14.28% | 3.17% | 17.46% | 8.73% | 30.15%త | 13.49% | 1.58% | 3.17% | 2.38% | 5.55% |

**కేసులలో చట్టప్రక్రియల ప్రగతి ఫిబ్రవరి 2007 నుండి ఆగస్టు 2008 వరకు**

| క్ర. సం. | జిల్లా చేసిన కేసులు | నిజనిర్ధారణ చేసిన కేసులు | ప్రధమ సమాచారం నమోదయిన కేసులు | నిందితులుఅరెస్టయిన చెల్లించినకేసులు | నష్టపరిహారం చెల్లించిన కేసులు | చార్జిషీట్ నమోదైన కేసులు |
|---|---|---|---|---|---|---|
| 1. | రంగారెడ్డి | 23 | 21 | 14 | 5 | 5 |
| 2. | నల్గొండ | 21 | 18 | 12 | 5 | 10 |
| 3. | గుంటూరు | 19 | 15 | 12 | 7 | 6 |
| 4. | కడప | 13 | 10 | 8 | 6 | 5 |
| 5. | మహబూబ్‌నగర్ | 12 | 11 | 7 | 2 | 1 |
| 6. | చిత్తూరు | 10 | 9 | 4 | 4 | 4 |
| 7. | విశాఖపట్నం | 9 | 7 | 3 | 1 | 1 |
| 8. | ప్రకాశం | 7 | 7 | 7 | 7 | 7 |
| 9. | విజయనగరం | 7 | 6 | 4 | 1 | 2 |
| 10. | వరంగల్ | 5 | 4 | 1 | 1 | |
| | **మొత్తము** | **126** | **108** | **72** | **38** | **41** |
| | శాతము | | 85.71% | 57.14% | 30.15% | 32.53% |

## దళిత స్త్రీలపై జరిగిన అత్యాచారాల వివరాలు : ఫిబ్రవరి 2007 - ఆగష్టు 2008 వరకు

| క్ర. సం. | జిల్లా | మొత్తం నేరాలు | హత్య | హత్యా యత్నం | అత్యాచారం | అత్యాచార యత్నం | దాడికుల దూషణ | కులదూషణ | స్త్రీలను అమ్మడం | ఆత్మహత్యకు ప్రోత్సహించుట | అనుమానాస్పద మృతి | ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1. | రంగారెడ్డి | 10 | 1 | | 3 | 2 | 1 | 2 | 1 | | | |
| 2. | నల్గొండ | 10 | 2 | | 6 | 1 | | | 1 | | | |
| 3. | గుంటూరు | 10 | | | 3 | 2 | 4 | | | | 1 | |
| 4. | కడప | 7 | | | 4 | 2 | 1 | | | | | |
| 5. | మహబూబ్‌నగర్ | 7 | | 1 | 3 | | | 3 | | | | |
| 6. | చిత్తూరు | 1 | | | | 1 | | | | | | |
| 7. | విశాఖపట్నం | 6 | | | 2 | 1 | 1 | 2 | | | | |
| 8. | ప్రకాశం | 3 | | | 1 | 1 | 1 | | | | | |
| 9. | విజయనగరం | 2 | | | | 2 | | | | | | |
| 10. | వరంగల్ | 2 | | | 1 | 1 | | | | | | |
| | **మొత్తం** | **58** | **3** | **1** | **23** | **12** | **8** | **7** | **2** | **0** | **1** | **0** |

## బాధితులకు చేదోడుగా సాక్షి చేపట్టిన న్యాయ సహాయక చర్యలు

| క్ర.సం. | వేసిన పిటీషన్ల వివరాలు | కేసుల సంఖ్య | సాధించిన కేసుల సంఖ్య |
|---|---|---|---|
| 1. | ప్రైవేట్ కంప్లైంట్‌వేసిన కేసులు | 7 | 5 |
| 2. | సెక్షన్ మార్చుటకు పిటీషన్లు వేసిన కేసులు | 4 | 3 |
| 3. | నేరస్థుల అరెస్టు కొరకు పిటీషన్ వేసినకేసులు | 1 | 1 |
| 4. | చార్జ్‌షీట్ నమోదు కొరకు పిటీషన్ వేసిన కేసులు | 4 | 3 |
| 5. | బెయిల్ అప్లికేషన్‌ను నిరాకరిస్తూ వేసిన కేసులు | 2 | 2 |
| 6. | పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సహకరించుటకు | 3 | 2 |
| | పిటీషన్ వేసిన కేసులు | | |
| | **పిటీషన్లు వేసిన మొత్తం కేసులు** | **21** | **16** |

పైన కనబరిచిన మొదటి పట్టిక గమనించినట్లైతే హత్య, అత్యాచారం, లేదా అత్యాచార ప్రయత్నం దాడి, స్త్రీలను అమ్మడం మొత్తం నేరాలలో 45.22%గా ఉంది. కేవలం స్త్రీలపై జరిగే అత్యాచారాలు, ప్రయత్నాలు, స్త్రీలను అమ్మడం. నేరాల సంఖ్య 28% గా ఉంది. దళితులపై ఎంతటి తీవ్రమైన నేరాలు దాడులు జరుగుతున్నాయో ఈ వాస్తవాలు స్పష్టం చేస్తున్నాయి. 14%కేసుల్లో కనీసం ప్రథమ సమాచారం కూడా నమోదు కాలేదు. చట్టప్రకారం 30 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి, చార్జిషీట్ కోర్టుకు సమర్పించాలని ఉన్నా, 68% కేసుల్లో చార్జ్‌షీట్ ఇంకా నమోదు కాలేదు. అత్యాచార బాధితునికి, అత్యాచారం జరిగిన 24 గంటలలోపే తక్షణ సహాయము కల్పించాలని చట్టంలో చెప్తున్నా, 70% కేసుల్లో ఇంత వరకూ తక్షణ సహాయం కూడా ఇవ్వలేదు. తక్షణ సహాయం పొందిన కేసుల్లో చాలా సందర్భాలలో సాక్షి మానవ హక్కుల కార్యకర్తలు పదే పదే విజ్ఞప్తి చేయడం ద్వారానే జరిగాయి. దీని వలన ఈ విధానంలో చూస్తే దళితుల కోసం ఎన్ని చట్టాలున్నా, అమలు తీరుమాత్రం నేతి బీరకాయలో నేతి చందంగా ఉంది. అందువలన దళితులు తమ హక్కుల్ని వినియోగించుకోవడం కోసం కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది అంతేకాక, అధికారులు చిత్తశుద్ధితో పని చేసి, దళిత మానవ హక్కులను పరిరక్షించాల్సిందిగా సాక్షి డిమాండ్ చేస్తుంది.

**సాక్షి**

●

# అంబేద్కర్-దళిత జనోద్ధరణ

...✍ - సారంపల్లి

భారతదేశ సమాజం కుల-మతాలతో అభివృద్ధి చెందింది. దీని ఫలితంగా అగ్ర కులాలు, నిమ్న కులాలు అంటూ వర్గాలుగా విభజించి దానికి అనుగుణంగా ఉత్పత్తిలో పని విభజన జరిగింది. ముఖ్యంగా కులాల మధ్యన తారతమ్యం పెరగడం ఫలితంగా ఉత్పత్తి ఆశించినంతగా పెరగలేదు. కష్టపడే వాడు అంటరానివాడుగా చూడబడుతున్నంత కాలం ఏ సమాజమూ అభివృద్ధి చెందదు. భారత సమాజం యొక్క మూలాలు కులం ప్రాతిపదికనే నిర్మించ బడినాయని అనేక మంది వాదనలు చేస్తున్నారు. వాస్తవానికి గత పాలకులు కులమతాలను సృష్టించి కొన్ని వర్గాలను అణచివేతకు గురిచేస్తున్నారు. మను చరిత్రలో ధర్మం నాలుగు పాదాలపై ఉండాలని ప్రవచించారు. బ్రాహ్మణ, క్షత్రీయ, వైశ్య, శూద్రులుగా సమాజాన్ని విడదీశారు. ఆ విధంగా పై మూడు వర్గాలు దిగువనున్న శూద్రులపై ఆదిపత్యం కలిగి ఉన్నాయి. శూద్రుల్లో మరికొంత మందిని అంటరానివారిగా చేసి సమాజానికి దూరంగా ఉంచారు. మానవ అవసరాల రీత్యా ఏర్పడిన వృత్తులు ఘనీభవించి కులాలుగా రూపాంతరం చెందాయి. ఒక వృత్తి నుండి మరొక వృత్తికి మారకుండా కుల కట్టుబాట్లు ఏర్పాట్లు చేశారు. ఒకే కులంలో వివాహ వ్యవస్థను పరిమితం చేశారు. ఆ విధంగా కులాలు ఘనీభవించాయి. ఆ కుల వ్యవస్థే నేడు మన సమాజ పురోభివృద్ధికి ఆటంకంగా తయారైంది. ఈ ఆటంకాన్ని తొలగించాలని అనేక మంది సంస్కర్తలు, విప్లవవాదులు కృషి చేశారు. త్యాగాలు చేశారు. జ్యోతీరావుపూలే లాంటి సంస్కర్తలు స్వయంగా ఆచరించారు. నేడు సమాజంలో కీర్తించబడుతున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆకోవకు చెందిన వారే. దళిత ఉద్ధరణలో వీరి సేవలు అత్యంత కీలకమైనవి. రాజ్యాంగ నిర్మాతగా ఉంటూ రాజ్యాంగంలోనే దళితులకు ప్రత్యేకమైన హక్కులు కల్పించిన ఘనత వీరికే చెందుతుంది.

బాబాసాహెబ్ అంబేద్కర్ 14 ఏప్రిల్ 1891న మధ్యభారతంలో తండ్రి రాంజీ, తల్లి భీమాబాయిలకు జన్మించారు. మహర్ల వర్గానికి చెందిన భీంరావు, ఐదో ఏట తల్లి మరణించడంతో పిన్ని మీరాబాయి భీంరావు పోషణ బాధ్యత తీసుకుంది. భీంరావును 'భీవా' అని పిలిచేవారు. ఇతను మాంసాహారం, మద్యపానం ఎరగరు. పాఠశాలలో భీంరావు పేరు 'భివారామ్‌జీ అంబా వడేకర్'గా నమోదు చేశారు. అంబా వడే అతని స్వగ్రామం. ఆ రోజుల్లో దళితులు పాఠశాలకు వెళ్లడం నేరంగా పరిగణించేవారు. భీంరావును పాఠశాలలో విడిగా కూర్చోబెట్టేవారు. చిన్నతనంలోనే అంటరాని తనాన్ని స్వయంగా అనుభవించిన వీరు సమాజ పోకడపై అధ్యయనం చేశారు. సంస్కృతం నేర్చుకోవాలన్న కోరిక ఎక్కువగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల సంకుచిత వైఖరి వల్ల అది సాధ్యం కాలేదు. 1900 సంవత్సరంలో ఒకటో స్టాండర్డ్‌లో చేరి 1907లో ఎస్ఎస్‌సి పాసయ్యారు. ఆ రోజుల్లో మహర్‌కు చెందిన వారు పదో తరగతి ఉత్తీర్ణుడు కావడం అద్భుతంగా చూసేవారు. ఐదో స్టాండర్డ్ చదువుతుండగానే తొమ్మిది సంవత్సరాల రమాబాయితో వివాహం జరిపించారు. 1913లో బిఏ ఉత్తీర్ణులయ్యారు.

తొలిసారిగా తొలి మహర్ విదేశీ విశ్వవిద్యాలయం కొలంబియాలో బరోడా మహారాజు గైక్వాడు స్కాలర్‌గా ఉన్నత విద్యను అభ్యసించారు. అమెరికాలో కాస్మోపాలిటన్ క్లబ్‌లో అందరితో సమానంగా జీవించారు. అక్కడి సమానత్వం, భారతదేశంలో అంటరానితనం ఈ రెంటి మధ్య తేడా స్పష్టంగా గమనించారు. అక్కడే లాలా లజపతిరాయ్‌తో స్నేహం చేశారు. భారత స్వాతంత్ర్యోద్యమంపై వీరిద్దరి మధ్య చర్చలు జరిగేవి.

మార్చి 18, 1955న మూడు లక్ష్యాలను వివరించారు. 1.విద్యను వ్యాప్తి చేయడం. 2. ప్రభుత్వ ఉద్యోగాలలో అస్పృశ్యులకు స్థానాలు. 3. గ్రామాల్లో అంటరానితనాన్ని నిర్మూలించడం లక్ష్యాలుగా ప్రకటించారు. 1910 మే 9న న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయ సదస్సులో తొలి రచనను సమర్పించారు. కుల సమస్యకు అంబేద్కర్ నాలుగు అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. 1.హిందూ కుల సమాజంలో వైవిధ్యాలు ఎన్ని ఉన్నా ప్రజల మధ్య లోతైన సాంస్కృతిక ఐక్యత ఉన్నదని చెప్పడం. 2.సాంస్కృతికంగా ఏకతాటిపైకి వచ్చిన వారిని కులం ముక్కలుముక్కలుగా నరికి వేస్తుందని చెప్పడం. 3.ప్రారంభంలో ఒకే కులం ఉందని చెప్పడం. 4.బయటకి పోయిన వారిని వెనక్కి తీసుకోవడం, లోపల ఉన్నవారిని వెలివేసి బయటకి పంపడం ద్వారా వర్గాలు కులాలుగా పరివర్తన చెందాయని చెప్పడం. పై నాలుగు అంశాలపై నిరంతర ప్రచారాన్ని సాగించారు. అత్యంత దుర్మార్గంగా కుల వ్యవస్థలో కులాచారాలను ఉల్లంఘించిన వారిని కులం నుంచి వెలివేసే సాంప్రదాయం అనాదిగా వస్తున్నది. కులం నుంచి వెలివేయడమంటే అది హత్యతో సమానం. అయినా దీనిని నేరంగా సమాజం గుర్తించడం లేదు. న్యాయస్థానాలు కూడా ఈ విషయమై స్పందించడం లేదని ఆయన వాదన. సాంద్రాయవాదుల చేతుల్లో కులం బలమైన ఆయుధంగా ఉంది. సంస్కర్తలను శిక్షించడానికి వారు దీనిని ఉపయోగించారు. ప్రజా జీవనంలో ధర్మాన్ని కుల వ్యవస్థ ధ్వంసం చేసింది. చాతుర్వర్ణ వ్యవస్థ పుట్టుకపై ఆధారపడలేదని, మనిషి గుణగణాలే దానికి ప్రాతిపదిక అని, ఆ వ్యవస్థను ప్రతిపాదించిన వారు జాగ్రత్తగా చెప్పిన మాటలను అంబేద్కర్ విశ్వసించలేదు. ఏ దేశంలో లేని కుల వ్యవస్థ భారత దేశంలోనే వేళ్లూనుకొని ఉంది. హిందూ మతం ఈ వ్యవస్థను పదిలంగా రక్షించుకుంటూ వస్తున్నది. కుల వ్యవస్థ రద్దు అయితే తరతరాలుగా అనుభవిస్తున్న ఉన్నత హోదా రద్దవుతుందని భీతితో కొద్ది మంది కులాన్ని పోషిస్తున్నారు. అందు వల్లనే కుల వ్యవస్థ నిర్మూలనకు హిందువులు సంఘటితమయ్యే పరిస్థితి లేకుండా పోయింది. చివరకు మహాత్మాగాంధీ అంబేద్కర్ గురించి అతను చేస్తున్న వాదన గురించి తన 'హరిజన్' పత్రికలో ఈ విధంగా చెప్పారు.

'అంబేద్కర్ హిందూ మతానికి ఒక పెనుసవాలుగా నిలుస్తున్నారు. మతం జ్ఞాన సంపదతో జీవించదు. అది రుషులు దార్శనికుల అనుభవాలతో వారి జీవితాలలో ప్రవచనాలతో జీవిస్తుంది. కులానికి మతంతో ఎటువంటి ప్రమేయం లేదు. మతానికి ఘోరమైన తప్పుడు వాఖ్యలు చేసి దిగజారి ఉన్న హిందువులను చూసి వారినే అసలుసిసలు హిందువులుగా చూపి అంబేద్కర్ పొరపాటు చేశారు. తన వాదన నెగ్గడానికి అవసరానికి మించినన్ని ఆధారాలు చూపెట్టి తన వాదాన్ని బలపర్చుకున్నారు.'

అంబేద్కర్‌పై మహాత్మాగాంధీ తన అభిప్రాయాలను స్పష్టంగానే తెలియజెప్పారు. దీనినిబట్టి కులమతాలు శాశ్వతంగా ఉంటాయన్న వాదన తెలుస్తోంది. అంటరానితనం మూలాలు కుల వ్యవస్థలో ఉన్నాయి. కుల వ్యవస్థ మూలాలు వర్ణాశ్రమ ధర్మాలను ఆశ్రయించిన మతంలో ఉన్నాయి. వర్ణాశ్రమ వ్యవస్థ మూలాలు బ్రాహ్మణీయ మతంలో

ఉన్నాయి. బ్రాహ్మణీయ మతం మూలాలు మూడు వర్ణాలకు చెందిన రాజకీయ అధికారంలో, ఆధిపత్యంలో ఉన్నాయి. అంటూ అంబేద్కర్ వ్యాఖ్యానించారు. బ్రాహ్మణుల యెడల అంబేద్కర్ స్పష్టమైన వైఖరితో ఉన్నారు. చెరువు నుంచి మంచినీరు తెచ్చుకునే హక్కు కోసం 1928లో జరిగిన మహద్ సత్యాగ్రహం సందర్భంగా బ్రాహ్మణులు పాల్గొనకుండా చూడాలని ఉద్యమ నాయకులు అంబేద్కర్‌ను కోరారు. కాని వారి కోరికను అతను అంగీకరించలేదు. బ్రాహ్మణులందరినీ అంటరానివారిగా, శుత్రువులుగా భావించడం సమంజసం కాదని తన అభిప్రాయాన్ని స్పష్టపరిచారు. అంటారాని తనాన్ని పాటిస్తున్నవారే నిజమైన శుత్రువలని స్పష్టపరిచారు.

గాంధీజికి అగ్ర కులాల వారితో శుత్రుత్వం తెచ్చుకోవడం ఇష్టం లేదని అంబేద్కర్ అభిప్రాయం. అంటరాని వారు హిందువులకు వ్యతిరేకంగా చేసిన ఆందోళనలను విమర్శిస్తూ ఇలా ప్రకటించారు. సత్యాగ్రహాన్ని విదేశీ శత్రువులపై మాత్రమే ప్రయోగించాలని గాంధీజి కోరుతున్నారు. కాని హిందువులపై అంటరానివారే తమ హక్కుల కోసం సత్యాగ్రహం చేపట్టరాదని గాంధీజి వాదన. గాంధీజి చేసిందల్లా హిందూ మతానికి దాని విశ్వాసాలకు ఒక తాత్విక ప్రాతిపదికను కనుగొనటమేనని అంబేద్కర్ వివరించారు. రాజ్యాంగ నిర్మాతగా అంబేద్కర్ ఈ దిగువ అభిప్రాయాలు కలిగి ఉన్నారు.

'చట్టాలు మనిషి కోసం మనిషి రూపొందించ్చుకున్నవి. మనిషిని చట్టాలు రూపొందించలేదు. తన సుఖం కోసం మనిషి చట్టాలను రూపొందించుకున్నాడు. చట్టాలకు సవరణలు అవసరం కావచ్చు. ఆ సవరణలను అందరి ఆమోదంతో చేయాలి. చట్టం అందరికీ ఒకే విధంగా ఉండాలి. అందరికీ ప్రయోజనం కలిగించేదిలా ఉండాలి. అది సామాజికంగా సమానత్వం, మానవత్వంతో కూడినదై ఉండాలి. ఇందులో ఐదు మౌళిక అంశాలున్నాయి. 1.ప్రజల ప్రయోజనం కోసం రూపొందించబడిన చట్టం. 2.ఏకపక్షమైన శక్తికాదు. 3.అందరికీ వర్తించే లౌకిక చట్టం. 4.దైవిక ప్రోద్భలంతో కాక మానవ ప్రోద్భలంతో రూపొందించబడింది. 5.కాలానుగుణంగా అవసరాల మేరకు మార్చుకోవచ్చు.

అంబేద్కర్ హేతువాతి కావడం వలన మూఢ విశ్వాసాలకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా నిలిచారు. నేటికీ ఈ మూఢ విశ్వాసాలే కులాన్ని రక్షిస్తున్నాయి. రాజ్యాంగంలో స్పష్టంగా చెప్పబడినప్పటికీ కులాల పేరుతో అంటరానివారినిగా చూస్తున్న వారిని రాజ్యాంగ పరంగా ఎలాంటి శిక్షలు నెలకొల్పలేక పోతున్నాయి.

అంబేద్కర్ తన విధానాలకనుగుణంగా ఆర్‌పిఐ పార్టీని నెలకొల్పారు. భారత దేశంలో ప్రతి పక్షం, ప్రత్యామ్నాయ ప్రభుత్వం లేకపోవడాన్ని గమనించి ఏకపార్టీ ప్రభుత్వం వలన ఏర్పడే ప్రమాదాలను ఆయన ప్రజల దృష్టికి తేవడానికే కృషి చేశారు.

భూ సంస్కరణల సమస్యపై తన అభిప్రాయాలు స్పష్టంగానే వివరించారు. 'భారతదేశంలో చిన్న కమతాలు వాటికీ పరిష్కార మార్గాలు' అను అంశంపై ఎకనామిక్ సొసైటీ పత్రికలో తన అభిప్రాయాలను వెలువరించారు. చిన్న కమతాలన్నింటినీ ఒకటిగా కలిపి వేసి ఉత్పత్తిని పెంచాలి. నూతన టెక్నాలజీని వినియోగించుకుని అధిక ఉత్పత్తి చేసి అధిక లాభాలను సంపాదించి అందరూ సమానంగా పంపిణీ చేసుకోవాలి. భూ విస్తీర్ణం, ఉత్పత్తి సామర్థ్యం పెంపుదలకు దోహదం చేసే కీలక అంశం కాబోదు. ప్రస్తుతం ఉన్న కమతాలు ఆర్థికంగా పటిష్టమైనవి కావు. చిన్న కమతాలు ఎక్కువగా ఉండడం వల్ల ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఎదురౌతున్న ఇబ్బందులు భూ పరిమాణానికి ముడిపడి ఉన్నవి కావు. మూలధనం పొదుపునుండి ఆవిర్భవిస్తుంది. నిధులు ఉన్నప్పుడే పొదుపు సాధ్యమౌతుంది. వ్యవసాయరంగంలో ఉన్న వారిలో అధికులు చాలా తక్కువ విస్తీర్ణం కలవారై ఉన్నారు. వ్యవసాయ రంగంలో ఉన్నవారిలో అధికులు ఏ నిర్మాణాత్మకమైన వ్యవసాయ సంబంధమైన పని లేకుండా ఉంటే సోమరిగా మిగిలిపోతారు. భూమి ముక్కలు ముక్కలుగా చీలిపోకుండా నివారించి కమతాలను విలీనం చేసి అందరూ శ్రమపడి ఫలితాన్ని అనుభవించాలని తెలిపారు.

హిందూ మతంలో ఉన్న అంటరాని తనానికి దూరంగా ఉండాలని, బౌద్ధ మతానికి మార్పిడి లక్ష్యం చేపట్టారు. బౌద్ధ మతంలో అంటరానితనం లేదు. 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లో దసరా సందర్భంగా బౌద్ధమతంలోకి సామూహిక మతమార్పిడి చేశారు. స్వయంగా 1956 మే 24న బొంబాయిలోని నారే పార్క్‌లో జరిగిన బుద్ధ జయంతి వేడుకల్లో బౌద్ధమతాన్ని స్వీరిస్తున్నట్లు బహిరంగ ప్రకటన చేశారు. నూతన మత స్వీకారానికి ముహూర్తాన్ని నిర్ణయించారు. ఆ విధంగా తన అంతిమ జీవితంలో బౌద్ధ మతస్తుడుగా మిగిలారు.

సంఘసంస్కర్తలు, అభ్యుదయవాదులు, హేతువాదులు మరియు భౌతికవాదులు అన్ని కోణాలనుండి అంటరానితనాన్ని నిరసించారు. ముఖ్యంగా కులవ్యవస్థ నిర్మూలనను ఆకాంక్షించారు. ఆర్థిక సమానత్వం రాకుండా కులనిర్మూలన కొనసాగదని కొందరు అంటుంటే, కులాంతర వివాహాలు కుల నిర్మూలనకు దోహదపడతాయని మరికొందరంటున్నారు. ఈ రెండూ ఏకకాలంలో సంభవించాలని మరికొందరి వాదన. ఏదేమైనా హిందూ మతం కులవ్యవస్థను కట్టుదిట్టంగా పెంచి పోషిస్తున్నది. ఈ వ్యవస్థ రక్షణకు తగు కట్టుబాట్లు చేయబడి వున్నాయి. రాజ్యాంగంలో కుల వివక్ష, అంటరానితనం నేరంగా పరిగణించినప్పటికీ కొందరు ఈ నేరాన్ని బహిరంగంగానే కొనసాగిస్తున్నారు. చట్టాలు, ప్రభుత్వయంత్రాంగం వాటిని ఏమీ చేయలేకపోతున్నాయి. స్వాతంత్ర్యానంతరం ఆరు దశాబ్ధాల తర్వాత కూడా అంటరానితనం నిర్మూలనకు పోరాటాలు సాగుతూనే వున్నాయి. ఈ ఉద్యమాలను ప్రోత్సహించడానికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్భంధంద్వారా అణిచివేయబూనుకోవడం రాజ్యాంగాన్ని అమలుజరపని ముద్దాయిగా ప్రభుత్వమే బోనులో నిలబడుతున్నది. ఉద్యమ ఫలితంగా రాష్ట్రంలో జస్టిస్ పున్నయ్య కమిషన్ వేశారు. ఆ కమిషన్ చేసిన సూచనలను ప్రభుత్వం ఆమోదించింది. ప్రతివారం చివరి రోజున సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మరియు తాహసీల్దారు స్థాయి కల్గినవారు దళితవాడలను సందర్శించి అక్కడ జరుగుతున్న నేరాలను పరిశీలించాలని కమిషన్ రిపోర్టులో నిర్ణయించాయి. ఈ సమస్యను అంగీకరించిన ప్రభుత్వం నేటివరకు ఎక్కడా ఈ విధానాన్ని అమలుజరపలేదు. ఎక్కడో ఒకచోట దళిత, గిరిజన అట్రాసిటీ కేసులు పెట్టడం కంటి తుడుపు చర్యలుగా జరుగుతున్నాయి. కలిసి భోజనం చేయడం, కలిసి చదువుకోవడం, కలిసి నివసించడానికే అంగీకరించన ప్పుడు కులాంతర్వివాహాల సమస్య నేటికీ సాహసోపేతంగానే పరిగణించాల్సి వస్తున్నది. దేశం 21వ శతాబ్ధంలోకి వెళ్ళినా మన మానసిక స్థితి మాత్రం 16వ శతాబ్ధం నుండి బయటపడలేదనేది నేడు జరుగుతున్న ఘటనలు రుజువు చేస్తున్నాయి. పాలకవర్గం ప్రత్యేక చొరవ, చిత్తశుద్ధి ప్రదర్శించి వివక్ష నిర్మూలనకు పూనుకోవాలి. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రజలను విజ్ఞానవంతుల్ని చేయడానికి కుల అనుకరణ దుష్ఫలితాలను వివరించడానికి అభ్యుదయ వాదులతో సంఘాలను ఏర్పరచాలి. వారు నిరంతరం ప్రజలకు అందుబాటులో వుండాలి.

శ్రమ చేయువారు అంటరానివారిగా వున్నంతకాలం దేశాభివృద్ధి, సమాజాభివృద్ధి జరగదనేది భారతదేశ సామాజిక చరిత్ర అధ్యయనం చేసినవారికి బోధపడుతుంది. సంస్కర్తల సూచనలను ఏమాత్రం పాటించినా వారిని గౌరవించినవాళ్ళమవుతాం. ●

# భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు

...✍ - కె. ప్రసన్న

కులం పేరిట దాడులు, మత మార్పిడుల వలన మారణహోమాలు, అదుపులేని అరాచకాల మధ్య కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి మన దేశంలో తాండవిస్తుంది. ఒరిస్సా, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ ఇలా ఒకటేంటి ఎక్కడ చూసినా ఏదో ఒకరూపంలో మానవ హక్కులుకాలరాయిబడుతూనే ఉన్నాయి. వీటికి అడ్డుకట్టలేదా? అనే ప్రశ్న మన మనసుల్లో మెదులుతుంది. అయితే, ఈ మానవ హక్కులను పరిరక్షించే ఉద్దేశ్యంతోనే భారతరాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు పొందుపరచబడ్డాయి. ఈ పరిస్థితులలో వాటిని ఒకసారి మననం చేసుకోవడంఅవసరం.

భారత రాజ్యాంగంలోని 3వ భాగంలో ప్రాథమిక హక్కులు పేర్కొనబడ్డాయి. ఇవి వేదకాలం నుండి ఈ దేశ ప్రజలు అనుభవిస్తున్న ప్రాథమిక విలువలు. ఇవి వ్యక్తుల గౌరవాన్ని కాపాడేందుకు, వ్యక్తులు, తమ వ్యక్తిత్వాలను సంపూర్ణస్థాయిలో అభివృద్ధి పరచుకునే పరిస్థితులను కల్పించేందుకు ఏర్పడినట్టివి. ఇవి మానవ హక్కుల ప్రాథమికనిర్మాణానికి హామీ ఇచ్చేవిధంగాను, వ్యక్తి స్వేచ్ఛపై వివిధ స్థాయిలలో దురాక్రమణ చేయుటపై ప్రభుత్వముపై బాధ్యతలను విధించే విధంగాను ఉద్దేశించబడినవి.

**ప్రాథమిక హక్కులకు, సాధారణ హక్కులకు గల తేడాలు:**

1. ప్రాథమిక హక్కులు, రాజ్యాంగముచే హామీ ఇవ్వబడినవి. కాగా, సాధారణ హక్కులు పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాల ద్వారా హామీ ఇవ్వబడినవి.
2. ప్రాథమిక హక్కులను రాజ్యాంగం అనుమతించినంత వరకు ఉపసహరించవచ్చును. లేదా కుదించవచ్చును. అయితే సాధారణ హక్కులను దేశ సాధారణ శాసనాలద్వారా కుదించవచ్చును. లేదా ఉపసంహరించవచ్చును.
3. ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినందుకు పరిష్కారంకోసం రాజ్యాంగంలో 32వ అధికరణ క్రింద సుప్రీంకోర్టును, ఆశ్రయించవలసి ఉంటుంది.
4. ప్రాథమిక హక్కులు కలిగిన వ్యక్తి వాటిని వదులుకోవడం జరుగదు. అయితే, సాధారణ హక్కులు కలిగిన వ్యక్తి హక్కులలో వేటినైనా తన ఇష్టానుసారంగా వదులుకోవచ్చు ప్రాథమిక హక్కులను మనం గమనించినట్లైనా...

**సమానత్వపు హక్కు**

అధికరణలు 14-18 వరకు సమానత్వమును గురించి వివరిస్తాయి.

**అధికరణ 14** : శాసనము దృష్టితో సమానత్వముగానీ, శాసనముల వలన సమాన రక్షణను గాని ఏ వ్యక్తికి నిరాకరించరాదని చెబుతుంది. ఈ అధికరణ రాజ్యాము యొక్క విధులను తెలుపుతుంది. దీనిలో రెండు పదాలు వాడబడ్డాయి.

1. శాసనం దృష్టిలో సమానత్వము

2. శాసనాల వలన సమానరక్షణ

శాసనదృష్టిలో సమానత్వము : భారతదేశములోని ప్రతిపౌరుడు కుల, మత, వర్గ, లింగ జాతి బేధము లేకుండా అందరూ సమానంగా చట్టానికి లోబడి ఉండాలి.

**శాసనాల వలన సమానరక్షణ** : చట్టాల ద్వారా వచ్చే పరిస్థితులలో ఇవ్వబడిన విశేషాధికాముల విషయములోను, బాధ్యతల విషయంలోను వ్యక్తులందరినీ ఒకేవిధంగా పరిగణించాలి.

**అధికరణ 15** : ప్రభుత్వం ఏ పౌరునికి కేవలం మత, జాతి, కుల, లింగ బేధం లేని జన్మస్థాన కారణాలను బట్టి లేక వాటిలో దేనినైనను బట్టి వివక్షత చూపరాదు.

- దుకాణములలో పబ్లిక్ రెస్టారెంట్లలో,హోటళ్ళలో, వినోద ప్రదేశాలలోకి ప్రవేశించుట నుండి...

- ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ నిధులతో పూర్తిగా గానీ, కొంతమేరకు నిర్వహించబడుతున్న లేక పూర్తిగా కేటాయించబడిన బావులు, చెరువులు, స్నానఘట్టాలు, రోడ్లు విహారస్థలములను వాడుకొనుటలో ఎట్టి అనర్హతలకు, షరతులకు గురి చేయరాదు.

- స్త్రీలకు,పిల్లలకు సంబంధించినటువంటి ఏవైనా విశేష నిబందనలు ప్రభుత్వము చేయదలచిన యెడల దానిని చట్టం నివారించదు. వారి రక్షణకై ప్రత్యేక నిబంధనలు చేయడానికి ప్రభుత్వానికి అధికారమిస్తుంది.

**అధికరణ 16** : పౌరులందరికీ, ప్రభుత్వ ఉద్యోగాలలో నియామకమునకు సమానవకాశములు.

ప్రభుత్వముచే నిర్వహించబడుతున్న కార్యాలయంలో లేదా పదవిలో ఉద్యోగమునకు లేదా నియామకమునకు సంబంధించిన విషయములలో పౌరులందరికి సమానావకాశములు ఉండాలి. కేవలం మతం, జాతి, కులం, లింగబేధం, వంశం, జన్మస్థలం, నివాస ప్రాంతము మొదలైన కారణాల వలన ఏ పదవికైననూ, ఏ ఉద్యోగమునకైననూ, ఏ వ్యక్తి అర్హుడు కాడని నిరాకరించరాదు. లేక పదవికి, ఉద్యోగానికి ఏ పౌరుని పట్ల వివక్షత చూపరాదు.

**అధికరణ 17** : అంటరానితనం (అస్పృశ్యత) రద్దు కావింపబడింది. ఏ రూపంలోనైనా దాని ఆచరణ నిషేధించబడినది ను దాని నుండి ఏర్పడిన ఏ అశక్తతనైనను అమలుచేయడం చట్టరీత్యా శిక్షింపదగిన నేరం.

**అధికరణ 19:**

- వాక్ స్వాతంత్ర్యం మరియు భావప్రకటనా స్వాతంత్ర్యం

- భారతదేశ భూభాగమునందు ఏ భాగములోనైనన

నివసించుటకు మరియు స్థిరనివాసము ఏర్పాటు చేసుకొనుట, మరియు సంచరించుట

- పౌరులు ఏదైనా వృత్తిని, లేదా వ్యాపారము లేదా వర్తకము చేసుకొనుట

- ఏదైనా వృత్తిని, లేదా వ్యాపారము లేదా వర్తకము చేసుకొనుటకు అవసరమగు వృత్తి సంబంధమైన లేక సాంకేతిక అర్హతలు పెంపొందించుకొనుట.

**అధికరణ 21 :** చట్టం నిర్ధారించిన విధంగా ఏ వ్యక్తి ప్రాణము లేక వ్యక్తిగత స్వాతంత్ర్యముకు రక్షణ కలుగజేస్తుంది.

**మత స్వాతంత్ర్యమునకు గల హక్కులు**

అధికరణ 25: అంతరాత్మననుసరించు స్వాతంత్ర్యము మరియు స్వేచ్ఛగా మతావలంబన ఆచరణ మరియు ప్రచారములకు హక్కు.

ప్రజాశాంతికి, నైతికతకు మరియు ఆరోగ్యమునకు మరియు అంతరాత్మననుసరించు స్వాతంత్ర్యమునకు మరియు తనకు ఇష్టమైన మతమును స్వేచ్ఛగా అవలంబించుటకు మరియు ఆచరించుటకు మరియు దానిని ప్రచారము చేయుటకు ప్రజలందరికి సమాన హక్కులు కల్పిస్తుంది.

**అధికరణ 26 :** మత వ్యవహారాల నిర్వహణ స్వాతంత్ర్యము ప్రజాశాంతికై, నైతికతకు మరియు ఆరోగ్యమునకు లోబడి ప్రతిమతశాఖ లేక అందలి ఏదేని ఉపశాఖ

(అ) మత, ధార్మిక ప్రయోనాలకోసం సంస్థలను స్థాపించుటకు మరియు నిర్వహించుటకు స్వాతంత్ర్యము

(బి) మత విషయాలలో స్వయంగా వ్యవహారాలను నిర్వహించుట

(సి) చర, స్థిరాస్తులను కలిగి ఉండుటకు, ఆర్జించుటకు మరియు

(డి) చట్ట ప్రకారం ఆ స్థిర, చరాస్థుల నిర్వహణకు హక్కు కలిగి ఉంటుంది.

**అధికరణ 27:** ఏదేని నిర్దిష్ట మతమును లేక మత శాఖను ప్రోత్సహించుటకు, లేక పోషించుటకు ఖర్చులను భరించుటకై నిర్ధిష్టపరచిన పన్నులను చెల్లించవలసిందిగా ఏవ్యక్తినీ బలవంతపెట్టరాదు.

**సాంస్కృతిక మరియు విద్యాపరమైన హక్కులు**

**అధికరణ 29:** భారత భూభాగంలో లేక అందులోని ఏదేని ప్రదేశంలో నివసించుచున్న పౌరులలోని ఏదేని వర్గంవారు తమకొరకు ప్రత్యేక భాష, లిపి లేక సంస్కృతి కలిగి ఉన్నచో వారు దానిని కాపాడుకొను హక్కు కలిగి ఉంటారు.

ప్రభుత్వంచే నిర్వహించబడే లేక ప్రభుత్వ నిధులనుండి సహాయం పొందుచున్న ఏ విధ్యా సంస్థలోనైనను కేవలం జాతి, మత, కుల, భాష కారణాలను బట్టి లేదా వాటిలో ఏ ఒక దానినిబట్టిగాని ఏ పౌరేనికైనను ప్రవేశము నిరోధించరాదు.

**అధికరణ 30:** మత ప్రాతిపదికపై లేక భాషా ప్రాతిపదికపై ఏర్పడిన అల్పసంఖ్యాక వర్గానికి చెందిన ప్రజలు తమకు ఇష్టమైన విధ్యా సంస్థలను స్థాపించుకొనుటకు, నిర్వహించుకొనుటకు హక్కు కలిగి ఉందురు.

విధ్యా సంస్థలకు సహాయం చేయు సందర్భాలలో, మత ప్రాతిపదికపైగాని, భాషా ప్రాతిపదికనగాని ఏర్పడిన అల్పసంఖ్యాక వర్గ నిర్వహణలో ఉన్నదను కారణాన్ని బట్టి ఏ విద్యాసంస్థకు వ్యతిరేకంగా ప్రభుత్వం వివక్షత చూపరాదు.

భారతరాజ్యాంగం పౌరులకు నిర్ధారించిన ప్రాధమిక హక్కులను సద్వినియోగం చేసుకోవాలి. వాటిపై అవగాహన కలిగి, ఆ హక్కులను పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి పౌరునిపైన ప్రభుత్వాలపైన ఉంది. ●

---

*(➜ 3వ పేజీ తరువాయి ..... )*

అలా చేసేవారిని చంపడం, స్కూళ్ళను తగలబెట్టడం, పసి పిల్లలను చంపడం వంటి పనులు చెయ్యడానికి మానవులను ఉసికొలిపితే అసలు మానవ విలువలు ఎలా నెలకొంటాయి?

ఒరిస్సాలో ఆదివాసుల పరిస్థితి, దళితుల పరిస్థితి అతి దారుణంగా ఉంటుంది. అక్కడి బ్రాహ్మణులు అతిపురాతన విలువలు గలిగిన ఛాందసవాదులు, ఇప్పటికీ వాళ్ళు మురికి గుంటల్లో చన్నీటి స్నానం చేస్తూ ఇళ్ళనిండా విగ్రహాలను పెట్టుకొని ఒక భయానక జీవితాన్ని జీవిస్తారు. ఒరిస్సా, బెంగాల్ సరిహద్దు గ్రామాల్లో ఇంటింటా ఒక కాళికా విగ్రహం, లేదా దుర్గ విగ్రహం ఉంటాయి. మెడలో మానవ శిరస్సుల దండ, పాదాల కింద చంపబోతున్న ఒక మనిషి, నాలుక చాచి భీకరంగా చూస్తున్న కండ్లతో ఉన్న విగ్రహాలను ఇండ్లలో పెట్టుకున్నాక కుటుంబాల్లో చిన్న పిల్లలకు సైతం ఎటువంటి మనస్తత్వం ఏర్పడుతుంది? ఈ కరడుగట్టిన బ్రాహ్మణవాదమే గ్రామాల్లో, పట్టణాల్లో కులవ్యవస్థను పకడ్బందీగా కాపాడుతోంది. ఇటువంటి విలువలు గలిగిన హిందూ సమాజంలోకి ఆదివాసులను రమ్మని ఎందుకు అడుగుతున్నారు? వచ్చి వారిని ఏ కులంలో చేరమంటున్నారు? వి.హెచ్.పి, ఆర్.ఎస్.ఎస్. సమాజంలో ఒక మౌలిక మార్పుకోసం ఆలోచించకుండా ఇతరులు చేసే ప్రయత్నాలను ఆపుతామంటే ఈ ఆధునిక ప్రపంచం వారిని మెచ్చుకుంటుందా? ఆ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న నవీన్ పట్నాయక్ ప్రభుత్వం అక్కడ ఎటువంటి మార్పులు తెచ్చిన దాఖలాలేదు. అక్కడి ఆదివాసులు, దళితులు కాస్తంత అభివృద్ధి చెందిన దాఖాలాలు కూడా లేవు. ఒరిస్సా విద్యా వ్యవస్థ చాలా అధ్వాన్నంగా ఉంది. అక్కడ అక్షరాస్యత ఏమాత్రం పెరగడంలేదు. వాటికి తోడు మతకల్లోలాలను అదుపుచెయ్యడంలో చాలా దారుణంగా ఫెయిల్ అయింది.

*(సూర్య దినపత్రిక సౌజన్యంతో...)* ●

# మానవహక్కులపై నెత్తుటి మరక - కందమాల్

...✍ - ఎస్. దేవకుమార్

హత్యలు, సజీవదహనాలు, మానభంగాలు, లూటీలు, గృహదహనాలు, అర్ధనగ్న ఊరేగింపులు, ప్రాణంకోసం పరుగులు, కొండల్లో, గుహల్లో బ్రతుకులు, ఊళ్ళకు ఊళ్లే ఖాళీలు, రక్షణ శిబిరాలు, శరణార్థుల క్యాంపులు, కత్తులు, కటార్లు, త్రిశూలాలు అన్నీ కలిపితే కందమాల్ ఒరిస్సా రాష్ట్రంలోని కందమాల్ జిల్లా, ఈ మధ్యకాలంలో ప్రముఖంగా వార్తల్లోకి ఎక్కింది. ఆ జిల్లా నుంచి వస్తున్న సమాచారం మొత్తం చూస్తే, ఇక్కడ మానవహక్కులకు ఎంత గట్టిదెబ్బ తగులుతుందో అర్థమవుతుంది. మతం ముసుగులో మనువాద సామ్రాజ్యాన్ని స్థాపించడానికి జరిగే ప్రయత్నంలో, మనువాదంలో తరతరాలుగా నలిగిన దళితులు, ఆదివాసీలే సమిధలు కావడం మానవ హక్కులను గౌరవించే వారందరికీ ఆందోళన కలుగుజేస్తుంది. అందుకే అసలు కందమాల్ గురించి కొంత నేపథ్యం అవసరం.

ఒరిస్సా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కందమాల్ ఒకటి 2001 జనాభా లెక్కల ప్రకారం కందమాల్ జిల్లా జనాభా 6,48,201 కాగా, 1991 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డు కులాలు 18.21 శాతం, షెడ్యూల్డు తెగలు 51.51 అంటే మొత్తం జనాభాలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల శాతం 69.72. షెడ్యూల్డు తెగల్లో ఎక్కువమంది కోంద్, ఆదివాసీ తెగలు, షెడ్యూల్డు కులాల్లో పాణో దళిత కులస్తులు ఎక్కువ ఉన్నారు. అందరూ కుయూ భాషనే మాట్లాడతారు. వీరి మధ్య గతంలో వైవాహిక సంబంధాలు కూడా ఉండేవి. పదిపదిహేను గుడిసెలున్న గ్రామాలు. వారివి షెడ్యూల్డు తెగలు దళితులకన్నా అనేక విధాలుగా వెనుకబడి ఉన్నారు.

> *మతానికి సమాజాన్ని సక్రమంగా నడిపించగల నైతిక బలం ఉండాలి. మతం శాస్త్రానికి (సైన్సు) అనుగుణంగా హేతుబద్ధంగా ఉండాలి, మతం సామాజిక నైతిక స్మృతిగా నిలవాలి. మతం పేదరికాన్ని సమర్థించి - శ్లాఘించకూడదు.*
>
> *త్రాగడానికి నీరు ఇవ్వని, కనీసం గుడిలో దేవుణ్ణి చూడనీయని మతం మతం కాదు. అది పాపపు కుప్ప. మీరు విద్యావంతులు కావడాన్ని నిషేధించి, మీ భౌతిక సుఖాన్ని సర్వనాశనం చేసిన మతంలో మీరు ఒక్క క్షణం కూడా ఉండకూడదు. జంతువులను హింసిస్తు పాపమని బోధిస్తూ సాటి మానవులను క్రూరంగా హింసించేది మతమేనా? కాదు, మోసం, దగా.*
>
> **- డా॥ బి.ఆర్. అంబేద్కర్**

అత్యధిక జనాభా కలిగిన షెడ్యూల్డు తెగలు బాగా వెనుకబడి ఉన్నారు. తక్కువ జనాభా కలిగిన షెడ్యూల్డు కులాలు విద్యా విషయంలో ముందంజలో ఉండి, ప్రభుత్వోద్యోగాలలో కూడా ఎక్కువగానే ఉన్నారు. దీనికి కారణం క్రైస్తవ మెషినరీలు ఇచ్చిన సహాయ సహకారాలు. అభివృద్ధిలేని కారణంగా షెడ్యూల్డు తెగలు తమ హక్కుల గురించి ప్రశ్నించే స్థాయికి చేరలేదని స్పష్టంగానే తెలుస్తుంది.

అభివృద్ధి చెందిన దళితులు ఈ క్రమంలో వారి వారి ప్రాథమిక హక్కులు వినియోగించుకునే దానిలో భాగంగా కొంతమంది క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. అంతే కాకుండా, ప్రధమిక హక్కులను వినియోగించుకుని వ్యవస్థలోని కులం కుళ్ళును ప్రశ్నించడం మొదలుపెట్టారు. ఇది గిట్టని మానవహక్కుల నిరోధక శక్తులు అమాయకులైన గిరిజనులను పావులుగా వినియోగించుకుని దళిత క్రైస్తవులపైకి ఉసిగొలిపి, మానవ హక్కుల అణచివేతకు మతం రంగు పులిమారు.

ఇక సంఘటనా వివరాలలోకి వెళితే, ఆగస్టు మాసంలో 23వ తేదీన విశ్వహిందూపరిషత్ నాయకుడైన లక్ష్మణానంద సరస్వతిని ఆయన ఆశ్రమంలోనే మావోయిష్టులు కాల్చిచంపారు. అతనితోపాటు మరి నలుగురు కూడా అక్కడికక్కడే మరణించారు. ఈ హత్యలు క్రైస్తవులే చేశారన్న అపోహతో మతఛాందసవాదులు క్రైస్తవులైన సామాన్యప్రజలపై దాడులు చేసి, వారి ఆస్థులను, ఇళ్ళను ప్రార్థనా మందిరాలను దహనం చేశారు. ఈ దాడులలో భాగంగా 32 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 2000 ఇళ్ళు ధ్వంసమయ్యాయి. 140 ప్రార్థనా మందిరాలు, చర్చిలు దాడులకు గురయ్యాయని, అధికారిక అంచనా. అయితే వాస్తవంగా అయితే, ఈ దాడులలో ఇప్పటికే 80మంది వరకు క్రైస్తవులు, వారి మద్దతుదారులైన కొందరు హిందువులు మరణించడమేకాక, వేలాది గృహాలు, చర్చిలు, స్వచ్ఛంద సంస్థలు బూడిద య్యాయి. గతనెల రోజులుగా కందమాల్ జిల్లాలోని బలిగూడ, దరింగ్‌బాడి, రైకియా, జి.ఉదయగిరి బ్లాకుల్లోనూ, పొరుగున ఉన్న కోరాపుట్ జిల్లాలోను జరుగుతున్న మారణ కాండ ఇది. జరిగిన సంఘటన లను కొన్ని మనం పరిశీలిస్తే, కందమాల్ ప్రభావంతో పొరుగు రాష్ట్రమైన బర్‌గడ్‌లో క్రైస్తవ మిషనరీలు నడుపుతున్న అనాథాశ్రమంపై దాడిచేసి, అక్కడ ఉన్న అనాథ బాలలను బయటకు పంపి, ఫాదర్‌ను కొట్టి, ఆశ్రమానికి నిప్పంటించారు. ఈ సంఘటనలో ఒక క్రైస్తవ సన్యాసిని సజీవదహనమైంది. ఈ సంఘటనలో దుండగులు అనాథబాలలను దహించకుండా వారిని బయటకు పంపడమే వారు చేసిన ఒక మంచిపని.

లక్ష్మణానంద సరస్వతి హత్య తరువాత జరిగిన హింసాకాండలో మూడు రేప్ కేసులు నమోదైనట్లుగా ఒరిస్సా, హోంశాఖ కార్యదర్శి తెలిపారు. బలిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక క్రైస్తవ సన్యాసినిపై సామూహిక అత్యాచారం చేశారు. ఆ నిందితులను గుర్తిస్తానని బాధితురాలు తెలపడం జరిగింది. రెండవదిగా తికబలి పోలీస్‌స్టేషన్ పరిధిలో 22 సంవత్సరాల హిందూ మహిళను సామూహిక అత్యాచారం చేశారు. మూడవదిగా బరాగర్ జిల్లాలో ఒక హిందూ బాలికను అత్యా చారం సజీవదహనం చేశారు. అంతేకాకుండా కుష్టు వ్యాధి

గ్రస్తుల అనాథ శరణాలయంలో వారికి సేవచేస్తూ, ఆ వచ్చే జీతంతో తన చదువును కొనసాగిస్తున్న పదంపూర్ మహిళా కళాశాల విద్యార్థినిని క్రైస్తవురాలనుకొని సామూహిక అత్యాచారం చేసి, సజీవదహనం చేశారు.

ఒక్క ఒరిస్సాలోనే కాకుండా దాని ప్రభావం దేశవ్యాప్తంగా మతం పేరిట దాడులు వ్యాపించాయి. కర్నాటక రాష్ట్రంలోని మంగుళూరులో చర్చిలపై దాడులు, విధ్వంసం జరిగింది. ఈ దాడులలో ఇరువర్గాలవారు ఎదురు దాడులకు దిగారు. ఈ పర్యవసానంలో నలుగురు వ్యక్తులు కత్తిపోట్లకు గురయ్యారు. జనజీవనం భయభ్రాంతులకు గురయ్యింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులతో పరిస్థితిని సమీక్షించి, మత మార్పిడులే ఇటువంటి పరిస్థితులకు కారణమని పేర్కొనడం జరిగింది. ఇటు ఆంధ్రప్రదేశ్‌లోనూ కొన్నిచోట్ల క్రైస్తవ మత బోధకులపై దాడులు చేశారు. అంతేకాకుండా ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా దళితులు రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాలలో బహిష్కరణకు, కులదూషణకు, దాడులకు గురయ్యారు. మరియు కేరళ రాష్ట్రములో కూడా ఈ ప్రభావం కనబడడం విశేషం. ఒక జిల్లానో, ఒక రాష్ట్రమో కాకుండా దేశవ్యాప్తంగా ఇటువంటి దాడులు జరగడం కడుశోచనీయం.

భారత రాజ్యాంగంలోని అధికరణ 25(1) శాంతి భద్రతలు, నైతిక విలువలు, ఈ భాగంలో చెప్పబడిన ఇతర హక్కులకు లోబడి ప్రతి ఒక్కరూ ఆత్మ ప్రబోధం, స్వేచ్ఛా, ఏ మతాన్నయినా అనుసరించి, ఆచరించి, ప్రచారం చేసుకునే స్వేచ్ఛకలిగి ఉంటారు.

పైన తెలుపబడిన అధికరణ ప్రకారం భారతీయ పౌరుడైన వ్యక్తి తనకు ఇష్టమైన మతాన్ని స్వీకరించవచ్చు అనేది నిర్ధారితమవుతుంది.

గతనెల రోజులుగా ప్రజ్వరిల్లుతున్న హింసను నిరోధించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవడంతో, రాష్ట్రంలో రాష్ట్రపతి పరిపాలన విధించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అంతే కాకుండా దానిపై నివేదికలను పంపమని ముఖ్యమంత్రికి, గవర్నరుకు ఆదేశాలు జారీ చేసింది.

ఆందోళనకరమైన విషయమేమిటంటే, తనకు గత 60 ఏళ్ళుగా వెన్నుదన్నుగా ఉన్న దళితులు, ఆదివాసీలు, ఊచకోతకు గురవుతుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ చోద్యం చూడడం. 34 కంపెనీల సిఆర్‌పిఎస్ బలగాలను, నాలుగు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ దళాలను పంపడం మాత్రమే చేసింది. అవి, దాడులు జరిగిన అనంతరం అడవులలో తలదాచుకుంటున్న వారిని వెనక్కి తీసుకొచ్చి రిలీఫ్‌క్యాంపులలో చేర్చడం మినహా మరేం చేయలేకపోతున్నాయి. దాడులకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేసే అధికారం వీరికి లేదు.

మనువాద సిద్ధాంతం మీద నిర్మించబడిన ఈ దొంతర సమాజంలో దళితులు, గిరిజనుల అభివృద్ధిని ఏమాత్రం ఓర్వలేని అభివృద్ధి నిరోధక శక్తులు వారి మధ్యనే చిచ్చుపెట్టి, ఒకరినొకరు చంపుకునేలా చేయడం పరిపాటి. దీనికి కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టి వారి ఉద్దేశాలు నెరవేర్చుకుంటారు. మనువాదాన్ని దానిలోని కులవ్యవస్థలో నీతిని ప్రశ్నించి, అంటరాని వారికి అండగా నిలిచిన బౌద్ధమతంలోకి అనేక మంది దళితులు చేరారు. మనువాదానికి దెబ్బతగులుతుందన్న భయంతో దానిని రక్షించే ధ్యేయంతో ఆదిశంకరుడు బౌద్ధమతాన్ని నాశనంచేసి, బౌద్ధ బిక్షువుల్ని ఊచకోత కోయించాడు. దీనికి కారణం దళితుల్లో పెరిగిన చైతన్యాన్ని మను సిద్ధాంతానికి గొడ్డలిపెట్టుగా భావించడమే ఇపుడు కందమాల్‌లో కూడా చరిత్ర పునరావృతమౌతుంది. చైతన్యవంతులైన దళితులు మనువాదపు ఊబినుండి బయటపడి ఆత్మగౌరవంతో బ్రతకడాన్ని సహించలేని మానవహక్కుల వ్యతిరేక శక్తులు దాడులకు పూనుకున్నాయి. అసలు ఒరిస్సాలో ఈ విధమైన దాడులు 1967 నుండే ప్రారంభమయ్యాయి. ఆనాటి నుండి ప్రతిఏటా ఏదో ఒక మూలన, ఏదో ఒక సాకుతో దళిత, గిరిజనుల అణచివేత జరుగుతూనే ఉంది. ఈసారి 84 ఏళ్ళ వృద్ధ స్వామీజీని హత్యచేయడం ఒక సాకుగా తీసుకుని విచ్చలవిడిగా దళితుల అణచివేత ప్రారంభించారు. ఒకప్రక్క మావోయిస్టులే ఈ హత్యకు కారణమని ప్రకటించినా, దానిని పెడచెవినపెట్టి, దళిత క్రైస్తవులే కారణమన్నట్లు వారిపై విరుచుకుపడ్డారు. రాజ్యాంగపరంగా సంక్రమించిన మతస్వేచ్ఛ కేవలం కాగితాలకే పరిమితమై రాజ్యాంగపుటల్లో మూలుగుతుంది. రాజ్యాంగాన్ని రక్షించాల్సిన ప్రభుత్వాలు దాన్ని భక్షించడం ప్రారంభించాయి.

మతంకోసమే మనిషి పుట్టినట్లు, అదే బాధ్యతైనట్లు, దానికోసం ప్రాణం బలిపెట్టడానికైనా, బలిచేయడానికైనా సిద్ధపడాలన్న మత మౌఢ్యంతో మానవతా విలువలను, మానవ హక్కుల పవిత్రతను సిలువవేస్తున్నారు. త్రిశూలంతో గుచ్చిలేపుతున్నారు. ఈ స్థితిలో అమాయకులైన స్త్రీలు, పిల్లలు, వృద్ధులు సమిధలుగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో మానవ హక్కులను గౌరవించే అన్ని శక్తులు ఏకమై మానవహక్కుల పరిరక్షణకోసం నడుంబిగించాలని సాక్షి పిలుపునిస్తుంది.

## అభినందనలు



*గుంటూరు జిల్లా న్యాయవాది మరియు సాక్షి మానవ హక్కులకు నిఘా, ఆంధ్రప్రదేశ్, కార్యకర్త* ***శ్రీ బి. కోటేశ్వరరావు*** *జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా సాక్షి అభినందనలు తెలుపుతుంది. అదే విధంగా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన సుధాకర్ బాబు మరియు చర్చిల్ బాబులకు సాక్షి అభినందనలు తెలుపుతుంది.*

**- సాక్షి**

# ఎదుగుతున్న దళిత మహిళపై ఉన్నత వర్గాల వేటు

సామాజికంగా, విద్యాపరంగా, రాజకీయంగా మరియు ఆర్థికంగా ఎదగాలనీ సమాజంలో గౌరవప్రధంగా జీవించాలనీ, తమకున్న హక్కులను వినియోగించుకోవాలని, స్థానికంగా పొదుపు సంఘాలు, గ్రామైఖ్యసంఘాలు ఏర్పాటు చేసుకోవడం అంతే కాకుండా రాజకీయంగా, వార్డుమెంబర్లుగా, సర్పంచ్‌లుగా ఎన్నికలలో పోటీచేయడం మొదలగు రంగాలలో చైతన్యవంతులౌతూ ఇపుడిపుడే ముందుకు అడుగులేస్తున్న దళిత మహిళలను, అదే తరుణంలో వారిని అణచివేయడానికి అగ్రవర్గాలవారు ఎంతగా కృషి చేస్తున్నారో ఈ నిజనిర్ధారణ నివేదికలో మనం పరిశీలించవచ్చు. దామగట్ల గ్రామం, నందికొట్కూరు తాలుకా, కర్నూలు జిల్లావాసి అయిన బాధితురాలు (30) అంగన్‌వాడి కేంద్రంలో అయగా మరియు గ్రామంలో పొదుపు సంఘాలకు, గ్రామైఖ్యసంఘ సెక్రటరీగా పనిచేస్తుంది. దళిత మాదిగ కులమునకు చెందిన బాధితురాలు భర్త, తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తుంది.

గ్రామంలో 40 పొదుపు లక్ష్మిసంఘాలు ఉన్నవి. ఈ సంఘాలన్నింటికి 5గురు గ్రూపు లీడర్లను గ్రామైఖ్యసంఘ సభ్యులుగా ఎన్నుకున్నారు. గ్రామంలో వృద్ధాప్య పెన్షన్లు మరియు గ్రామానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు వీరి సమక్షంలోనే జరుగుతుండేవి.

ది.24.09.07న బాధితురాలు అంగన్‌వాడి పాఠశాలలో తన విధినిర్వహణలో ఉండగా ఆ గ్రామ ఉపసర్పంచ్ మరియు సర్పంచ్ భర్త అయిన నిందితుడు రెడ్డి కులమునకు చెందిన వ్యక్తి మధ్యాహ్నం 12గంII ల సమయంలో తన అనుచరుల ద్వారా గ్రామ సచివాలయానికి బాధితురాలిని పిలువనంపించినాడు. విషయం తెలుసుకోవడానికి వెళ్ళిన బాధితురాలిని "నీవు గ్రామైఖ్య సంఘ సెక్రటరీగా ఉండుటకు వీలు లేదు" అని ఒక తెల్లకాగితంపై రాజీనామా సంతకం చేయమని అడుగగా, బాధితురాలు ఈ విషయమై గ్రామైఖ్యసంఘ సభ్యులందరం కలిసి తీర్మానించుకుంటాము అని సంతకం చేయుటకు నిరాకరించిన బాధితురాలిని బెదిరించి, సంతకం చేయమని, బలవంతం చేయగా, నిరాకరించిన బాధితురాలిని దుర్భాషలాడి, స్థానిక ఎమ్.ఎల్.ఎ కి చెప్పి ఉద్యోగం నుండి తొలగిస్తానని బెదిరించినాడు.

అదేరోజు మధ్యాహ్నం మూడుగంటల సమయంలో మరలా నిందితుడు, బాధితురాలిని తన ఇంటికి పిలిపించి, "మర్యాదగా సంతకం పెట్టు, లేదంటే నీ అంతు చూస్తానని బెదిరించాడు. ఏమిచేసినా, సంతకం పెట్టనని ఎదిరించిన బాధితురాలిని, నిందితుడు జడలాగి, చీరలాగి, చేయిపట్టుకుని లాగి, సంతకం పెట్టమని దౌర్జన్యం చేశాడు. అంతటితో ఆగకుండా అడ్డువచ్చిన తోటి దళితురాలిని కూడా ప్రక్కకునెట్టి కులంపేరుతో వారిని దూషించి, బాధితురాలిని జడపట్టి లాగి కొట్టినాడు.

**గమనించవలసిన అంశాలు :**

- బాధితురాలు దళిత కులమునకు చెందియున్నది. మరియు కేంద్ర ప్రభుత్వముచే నడుపబడుచున్న అంగన్‌వాడి కేంద్రంలో ఆయాగా పని చేయుచున్నది.
- నిందితుడు బాధ్యతగల ఒక ప్రజాప్రతినిధి అంతేకాకుండా ప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నుకొనబడిన వ్యక్తి మరియు ఆ గ్రామ ఉపసర్పంచ్ మరియు సర్పంచ్ యొక్క భర్త. గ్రామాభివృద్ధికై కృషి చేయవలసిన బాధ్యత కలిగిన వ్యక్తి.
- గ్రామ సమైఖ్య సంఘానికి సంబంధించి, ప్రజాప్రతినిధులకు ఎటువంటి నిర్ణయాలు తీసుకునే అధికారం లేనప్పటికీ బాధితురాలిపై నిందితుడు దౌర్జన్యం చేయడం జరిగింది.
- ప్రభుత్వ అధికారులు మరియు గ్రామ ఉపసర్పంచ్ కలిసి బాధితురాలిని గ్రామైఖ్యసంఘం నుండి తొలగించారు.
- బాధితులకు న్యాయం చేయవలసిన ఎస్.ఐ వారిని బెదిరించి, కేసు రాజీ చేసుకోమని ప్రోత్సహించాడు.
- బాధితురాలిని, నిందితుడు బెదిరింపులకు గురి చేస్తున్నాడు.
- డిఎస్‌పి ఈ కేసును విచారణ చేయవలసి వుంది. ఆ విచారణలో కూడా బాధితులను విచారించలేదు. కానీ, కానిస్టేబుల్ విచారణ జరిపాడు.
- స్థానిక కానిస్టేబుల్ వచ్చి, డిఎస్‌పి ఈ కేసును తప్పుడు కేసుగా నమోదు చేశారని బాధితులకు నోటీసు ఇచ్చారు.
- అంతేకాకుండా బాధితురాలిని అంగన్‌వాడి ఆయాగా ఎన్నికయినప్పటి నుండి నిందితులు వేధిస్తున్నారని బాధితురాలు స్వయంగా తెలిపింది.

**సిఫారసులు : -**

1) ఈ కేసును డిఎస్‌పి వెంటనే విచారణ జరిపి, చార్జిషీట్ నమోదు చెయ్యాలి.
2) బాధితురాలిని బెదిరించినందుకు ఎస్.ఐ పై కూడా కేసు నమోదు చెయ్యాలి.
3) నిందితుని వెంటనే అరెస్టుచేసి, శిక్షించాలి
4) బాధితురాలికి తక్షణమే నష్టపరిహారం అందించాలి.
5) వెలుగు ప్రాజెక్ట్ సి.సి.పై మరియు ఎపిఎమ్ పై చర్య తీసుకోవాలి.
6) గ్రామంలో ఇలాంటి దాడులు దళితులపై జరుగకుండా పోలీస్ యంత్రాంగం నిఘా ఏర్పాటు చెయ్యాలి.

ఈ కేసుకి సంబంధించి ఎఫ్ఐఆర్. ది.29.11.07న 57/07 నంబరుతో U/s 364 r/w 34 IPC 3(1) (x1) SC/ST రిజిష్టర్ అయ్యింది. కానీ, ఇంతవరకు పోలీసు అధికారులు ఎట్టి చర్యలు తీసుకోకుండా, చార్జిషీట్ నమోదు చేయకుండా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ద్వారా వారికి దళితులపట్ల మరియు చట్టంపట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో మనకు అవగతమౌతుంది.

నిజనిర్ధారణ కమిటి సభ్యులు

1. సురేష్, 2. సుబ్బారాయుడు, 3. మల్లికార్జున, 4. నరేష్

- దళిత కార్యకర్తలు, కర్నూలు

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు : ఆగష్టు -సెప్టెంబర్ 2008

| వ. నెం. | స్థలము | నేరం | తేది / సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 1 | కడప | కులదూషణ దాడి | 28.7.08న చింతకొమ్మ దిన్నె మండలంలోని జమాల్ పర్చి హరిజనవాడకు చెందిన కొండూరు చిన్నయ్య బోడెద్దుల పల్లెకు చెందిన సయ్యద్ మస్తానయ్యను బాకీ డబ్బులు అడిగేందుకు వెళ్ళారు. దీంతో మూకుమ్మడిగా సయ్యద్ మస్తానయ్య ఇతర 5గురు దాడి చేసి, కులం పేరుతో దూషించారు. |
| 2. | హైదరాబాద్ | కులదూషణ | 4.4.08న రెజిమెంటల్ బజార్, నాలుగు నెలల క్రితం బాబుజగజ్జీవన్‌రామ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా చందా వసూలుకు వెళ్ళిన సదానంద్‌ను వీరేశ్వరరావు కులం పేరుతో దూషించాడు. ఈ కేసులో ఇంతవరకు ఎటువంటి చర్య తీసుకోలేదు. |
| 3. | కర్నూలు | దాడి కులదూషణ | 6.8.08న బండి ఆత్మకూరు మండలం జిసిపాలెం గ్రామానికి చెందిన గుడిసెల బాలయ్య, అతని భార్య రమణయ్యలపై అదే గ్రామానికి చెందిన బొల్ల రమణయ్య మరియు ఇతర ముగ్గురు దాడి చేసి కులం పేరుతో దూషించారు. బాలయ్య అతని తమ్ముడు రాజు గృహాలను దహనం చేశారని కౌంటర్ కేసు నమోదు చేశారు. |
| 4. | విశాఖపట్నం | కులదూషణ | 8.8.08న కంచరపాలెం, ఇందిరానగర్‌లో నివాసముంటున్న ముద్రి నారాయణ రావుకు ఈశ్వరప్రసాద్ కొంతకాలం క్రితం తన వాహనానికి పెయిటింగ్ వేయమని ఇచ్చాడు. ఆలస్యం కావడంతో ఆగ్రహించిన ప్రసాద్ తనను కులం పేరిట దూషించాడని నారాయణరావు ఫిర్యాదు చేశాడు. |
| 5. | విశాఖపట్నం | అంటరానితనం | 23.8.08న కోలువురట్ల మండలంలోని కొడవటి పూడి గ్రామంలో గ్రామదేవత పండగ సందర్భంగా దళితులపై అంటరానితనం మరియు రెండుగ్లాసుల పద్ధతి పాటించడమే కాక దళిత వాడలో అందరిపై దాడి చేశారు. 13 మందికి గాయాలయ్యాయి. సి.ఐ.గ్రామాన్నిసందర్శించారు. |
| 6. | నల్గొండ | | 25.8.08న కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామపంచాయితీ, రసూల్‌గూడెం |
| 7. | ఆదిలాబాద్ | కులదూషణ | 22.8.08న దండేపల్లి మండలం, పెద్దపేట గ్రామానికి చెందిన చింతకింది బుచ్చిరాజంను కొట్టి గాయపరిచి కులం పేరుతో దూషించిన ఇద్దరు వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, శిక్షించాలని అంబేద్కర్ సంఘం డిమాండ్ చేసింది. |
| 8. | మహబూబ్‌నగర్ | కులదూషణ | 26.8.08న కొత్తూరు (మం), తీగాపూర్ గ్రామానికి చెందిన గొంగళ్ళ, శేఖర్ రెడ్డి (29) ఈ నెల 6న అదే గ్రామంలోని ఇందూరుపాటి సురేష్‌ను, మంచి నీటి ట్యాంకర్‌ను శుభ్రం చేస్తుండగా కులం పేరుతో దూషించాడు. |
| 9. | రంగారెడ్డి | అవమానం భరించలేక ఆత్మహత్య | 30.8.08న పుడూరు (మం.) అంగడిచిట్టం గ్రామానికి చెందిన పెద్యాల బుచ్చయ్యను అదే గ్రామానికి చెందిన దయనందరెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలు, కొట్టి అతని దగ్గరున్న బండిని తీసుకున్నారు. గురువారం గ్రామంలో పంచాయితీ పెట్టి గ్రామస్తుల సమక్షంలో బండబూతులు తిట్టారు. బండిని తిరిగి ఇవ్వలేదు. ఆ అవమానాన్ని భరించలేక బాధితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. |
| 10. | రంగారెడ్డి | కులదూషణ | 29.8.08న దోమ, కిష్టాపూర్ తండాకు చెందిన నెనావత్ బాద్య, ఫీల్డ్ అసిస్టెంట్‌గా చేస్తున్నాడు. ఉపాధిహామీ కూలీలకు కూలీడబ్బులు రానందున అదే గ్రామానికి చెందిన రాములు, జగన్‌లు బాద్యను కులంపేరుతో దూషించారు. |
| 11. | క్రిష్ణా | కులదూషణ దాడి అక్రమ నిర్బంధం | 26.8.08న మచిలీపట్నం మార్కెట్ యార్డ్‌కమిటీ చైర్మన్ మేకా భాస్కరరావు సోమవారం విధి నిర్వహణలో ఉన్న వ్యవసాయశాఖ సంచాలకులు కోడూరు మోషె అనే దళిత ఉద్యోగి పట్ల అనుచితంగా ప్రవర్తించి దుర్భాషలాడి, కులం పేరుతో దూషించి ఈడ్చుకెళ్ళి గదిలో పెట్టి తాళంవేసి నిర్బంధించాడు. |
| 12. | పశ్చిమగోదావరి | సామూహిక అత్యాచారం | 2.9.08న అశ్వారావు పేట (మం) రాజానగరం గ్రామానికి చెందిన యువతిని (19) జీలుగుమల్లి (మం) మడకం వారి గూడెం సమీపంలోకి టేకు ప్లాంటేషన్‌లోకి ఐదుగురు యువకులు లాక్కెళ్ళి ఆమెపై అత్యాచారం చేశారు. అడుకున్న ఆమె ప్రేమికుడిని తీవ్రంగా గాయపరిచారు. |

| | | | |
|---|---|---|---|
| 13. | నెల్లూరు | కులదూషణ | 29.8.08న ఆత్మకూరు సబ్‌కోర్టులో సబ్‌జైల్ వార్డెన్‌గా పనిచేస్తున్న సి.మోసెస్‌ను రిటైర్డ్ ఎమ్మార్వో పి. అంజయ్య కోర్టు ఆవరణలోనే కులంపేరుతో దూషించి, దుర్భాషలాడాడు. |
| 14. | కడప | కులదూషణ హత్యాయత్నం | 6.9.08 ప్రొద్దుటూరు, సంజీవనగర్‌లోని రామాలయంలో తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లెల లింగారెడ్డి ఆధ్వర్యంలో మరో ఇద్దరు పార్టీ సమావేశం ఏర్పాటుచేయగా దళిత చెన్నయ్య మరొక మహిళఅడ్డుకోగా వారి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ విషయంగా ఎట్రాసిటీ కేసు నమోదయింది. ఆ కేసు ఉపసంహరించుకోవాలనే బాధితురాలిని కోరారు. ఆమె అంగీకరించక పోవడంతో ఆమెను మురళీ యాదవ్, నాగర్జునలు కలిసి కులం పేరుతో దూషించి, ఆమెపై దాడిచేసి, చాతిపై కుడిచెయ్యిపై పొడిచి గాయపరిచారు. |
| 15. | హైదరాబాద్ | కులదూషణ దాడి బహిష్కరణ | 9.9.08న అంబర్‌పేట్, రఘునాదనగర్ నివాసి మల్లేష్ (27) స్థానిక జిస్వాల్‌నగర్‌లో నివసించే మన్మోహన్‌గౌడ్ వద్ద కేబుల్ పనిచేస్తున్నాడు. ఇటీవల తనకు తెలియకుండా డబ్బు స్వాహాచేస్తున్నాడని జ్వరంతో ఉన్న మల్లేష్‌ను అతని భార్యను గత నెల 27న తన ఇంటికి పిలిపించి, అతని అనుచరులతో కలిసి కొట్టి, వారిని కులం పేరుతో దూషించి వారితో బలవంతంగా బాండుపేపర్లపై సంతకాలు తీసుకుని ఇంటినుండి వెళ్ళగొట్టారు. |
| 16. | రంగారెడ్డి | కులదూషణ | 11.9.08న తాండూరు, పద్మెముల్ (మం) మంబాపూర్ గ్రామంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఇరువర్గాల మధ్య దాడి ఘర్షణలో తమను కులంపేరుతో దూషించారని దేశ్‌పాండే మరి 5గురి దళితులు మీద ఫిర్యాదు చేశారు. |
| 17. | క్రిష్ణ | వెట్టిచాకిరి | 24.7.08న గుడివాడ టౌన్, ఉయ్యూరు (మం) ముదునూరు గ్రామం నుండి వచ్చిన వలస కూలీలకు జీతాలు ఇవ్వకుండా వారిని గదిలో పెట్టి బెల్టు, కర్రలతో కొట్టారు.వీరు పోలీసులను ఆశ్రయించారు. |
| 18. | ఖమ్మం | అత్యాచార యత్నం | 1.9.08న అశ్వారావుపేట (మం), కేసప్పగూడెం గ్రామానికి చెందిన కొవ్వాసి తులసి (20) అనే ఒక గిరిజన యువతిపై జీలుగుమల్లి (మం) మడకం వారిగూడెం గ్రామానికి చెందిన 5గురు యువకులు అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. |
| 19. | మహబూబ్‌నగర్ | కులదూషణ | 5.9.08న గద్వాల రూరల్, గుంటిపల్లి గ్రామంలో భూ వివాద విషయంలో రేకులపల్లి గ్రామానికి చెందిన బోయ వెంకటన్న, సత్యన్నలు హనుమంతును కులంపేరుతో దూషించారు. |
| 20. | హైదరాబాద్ | కులదూషణ దాడి | 7.9.08న కరీంనగర్ (జిల్లా), కొలనూరు (మం) చెందిన వి. జీవరత్నం ఎస్సీ, ఎస్టీ కమీషన్‌ను ఆశ్రయించాడు. తన పొలం వరకు కె. తిరుపతి రెడ్డి అనే భూస్వామి రోడ్డు నిర్మించాడు. దాన్ని అడ్డుకున్నందుకు అతని అనుచరులు అగ్రకుస్తులు నాపై, నాకుమారులపై మూకుమ్మడి దాడిచేసి తీవ్రంగా కొట్టారు. కులం పేరుతో దూషించారని ఆరోపించారు. ఇలా ఉండగా పోలీసులు నిందితులతో కుమ్మక్కై బాధితులపై కౌంటర్ కేసులు పెట్టారు. డిఎస్పి తహసీల్దార్ కలిసి వారు ఎస్సీ కాదని, బిసిసి తప్పుడు కులధృవీకరణ పత్రాన్ని జారీచేశారు. |
| 21. | తూర్పుగోదావరి | కులదూషణ | 01.09.08న రాజానగరం, తలారి చంద్రరావు చక్రద్వార బంధానికి చెందిన దళితుడు అదే గ్రామానికి చెందిన శీనం శెట్టి వెంకటరమణ దగ్గర డబ్బు అవసరమై తన పొలం తాకట్టు పెట్టాడు. తన రిజిస్ట్రేషన్ అని చెప్పి, తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అదేమని అడిగిన చంద్రరావును అతని భార్య శారదను కులంపేరుతో దూషించి గెంటివేశాడు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదయింది. |
| 22. | కర్నూలు | కులదూషణ దాడి | 2.9.08న శిరివెళ్ళ మండలం, ఎర్రకుంట గ్రామానికి చెందిన దళిత బాలస్వామి పై అదే గ్రామానికి చెందిన హనుమంతు పొలం విషయమై ఘర్షణపడి కులంపేరుతో దూషించి దాడిచేశారు. |
| 23. | కర్నూలు | కౌంటర్‌కేసులు | 3.9.08న ఆత్మకూరు చెక్‌పోస్ట్ చనిపోయిన దళితులను పూడ్చడానికి జానెడు స్మశానం అడిగినందుకు అధికార పార్టీ నాయకులు కులవివక్ష పోరాటకమిటి నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. |
| 24. | నల్గొండ | కులదూషణ | 14.908న నార్కట్‌పల్లి మండలం, మాంద్ర గ్రామంలో శుక్రవారం జరిగిన గణేష్ నిమజ్జన యాత్రలో దళితులు తమ విగ్రహాన్ని బిసి కాలనీ వైపు తీసుకురాగా కులం పేరుతో దూషించి అడ్డుకోవడంతో పాటు ఉద్దేశపూర్వకంగా దాడిచేశారు. |
| 25. | మహబూబ్‌నగర్ | అత్యాచార యత్నం | 3.9.08న నాగర్‌కర్నూలు, బొందలపల్లి గ్రామానికి చెందిన 15 ఏళ్ళ మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన కరుణాకర్ రెడ్డి అత్యాచారానికి పాల్పడ్డాడు. |

| వ. నెం. | స్థలము | నేరం | తేది / సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 26. | ప్రకాశం | దళితుల వినాయక విగ్రహాన్ని అడ్డుకోవటం | 7.9.08న గుడ్లూరు కొత్తపేటలో వినాయక నిమజ్జన ఊరేగింపు సందర్భంగా ఊరి కట్టుబాట్లను ధిక్కరించి దళితులు వినాయకుని ఊరేగింపు నిర్వహించడంతో గ్రామపెద్దలు అడ్డుకుని వాగ్వివాదానికి దిగారు. |
| 27. | కడప | దాడి | 8.9.08న ప్రొద్దుటూరు, ఎర్రన్నకొట్టాలుకు చెందిన ఎం.ఆర్.పి.యస్ నాయకుడు సుధాకర్ ఆధ్వర్యంలో కొందరు యువకులు వినాయక విగ్రహాన్ని నిమజ్జనం కోసం కెసి కెనాల్‌కు ఆదివారం సాయంత్రం బయలుదేరారు. అదేవిధంగా ఇందిరానగర్‌కు చెందిన వారు కూడా తమ విగ్రహం కేసి కెనాల్‌కు బయలుదేరారు. దారి ఇవ్వలేదని ఇరువర్గాలు ఒకరిపై ఒకరుదాడి చేసుకున్నారు. |
| 28. | కర్నూలు | కులదూషణ | 10.9.08న గూడూరు మండలంలోని విధి నిర్వహణలో ఉన్న తహసీల్దారు జనార్ధన్‌రావును, కొండలయ్య కులం పేరుతో దూషించాడు. |
| 29. | చిత్తూరు | కులదూషణ | 13.09.08న రామచంద్రాపురం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో డాక్టర్‌గా పనిచేస్తున్న ఆనందరావును పెద్ద కుప్పపల్లి, పంచాయితీకి చెందిన నాగరాజు మరి ఇద్దరు కులం పేరుతో దూషించి, ధౌర్జన్యం చేశారు. |
| 30. | రంగారెడ్డి | కులదూషణ | 12.09.08న పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో దళితులపై దాడులు జరిగి 3 రోజులు గడిచినా దాడి చేసిన అగ్రకులాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయలేదని వారిని వెంటనే కెవిపియస్ డిమాండ్ చేసింది. |
| 31. | హైదరాబాద్ | కులదూషణ | 17.09.08న గ్రేటర్ హైదరాబాద్, దోమలగూడ సర్కిల్-9 స్వీపర్ కృష్ణ మరికొందరిని మంగళవారం సంజయ్ అగర్వాల్ అనే వ్యక్తి కులంపేరుతోను, మరియు అసభ్యపదజాలంలో దూషించాడు. |
| 32. | తూర్పుగోదావరి | కులదూషణ | 10.09.08న రంపచోడవరం, దేవీపట్నం (మం) దామనపల్లి గిరిజన సంక్షేమ పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతున్న ఒక మైనర్ గిరిజన బాలిక గర్భం దరించింది. మరియు రంపచోడవరం (మం) బూసుగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువిన గిరిజన మైనర్ బాలిక కూడా గర్భం దాల్చింది. |
| 33. | తూర్పుగోదావరి | లైంగికదాడి | 14.09.08న కిర్లంపూడి (మం), రాజుపాలెం గ్రామానికి చెందిన గెడ్డం దైవ ప్రసాద్ వీరవరం గ్రామానికి చెందిన బత్తిన వీర్రాఘవులు ఇద్దరు, వైజాక్‌కు చెందిన డానియేలుకు చెంది పొలాన్ని కౌలుకు చేసుకుంటూ పొలంలో పనిచేసుకుంటుండగా రాజుపాలెం గ్రామనికి చెందిన న్యాయవాది జోకా.వెంకటశ్రీనివాస్ విజయకుమార్, ఆపొలం తన తండ్రికి మారిందనీ, ఆపొలం చేయడానికి మీరెవరంటూ వీరిపై దాడి చేసి గాయపరచి, కులం పేరుతో దూషించాడు. |
| 34. | రంగారెడ్డి | కులదూషణ | 17.09.08న వికారాబాద్ పట్టణంలోని డైట్ ఎదురుగా ఉన్న నం.1 సాంఘీక సంక్షేమ శాఖ, బాలుర వసతి గృహ విధ్యార్థులు కలుషిత నీరు తాగడం వలన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. |
| 35. | వరంగల్ | అత్యాచారకేసు | 17.09.08న నల్లబెల్లి (మం), పంతులుపల్లి, సర్పంచ్‌పై మేకల ఎల్లయ్య భూతగాదాల్‌లో ఫిర్యాదు చేయగా అట్రాసిటీ కేసు నమోదు చేశారు. |
| 36. | కర్నూలు | దాడి | 21.09.08న హోళగుండ (మం), ఇంగళోదాహాల్ గ్రామ దళితులపై, బిసి కులాల వారు దాడి చేశారు. |
| 37. | రంగారెడ్డి | కులదూషణ | 21.09.08న పరిగి, దోమ(మం), దిర్సంపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు రాయిగంటి, అనంతయ్యను మొగులయ్య అద్దె డబ్బులు చెల్లించలేదని, పాఠశాలలో నుండి కాలర్ పట్టి బయటకు లాక్కొచ్చి కులం పేరుతో దూషించి, దాడి చేశాడు. |
| 38. | నల్గొండ | కులదూషణ | 23.09.08న నాగార్జునసాగర్, హిల్‌కాలనీ ప్రాంతానికి చెందిన కృష్ణకిశోర్ ఇంటికి మంచి నీళ్ళుఅడిగే నెపంతో వెళ్ళి, అతనిపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన ఆటో డ్రైవర్ షరీఫ్ మరియు అతని అనుచరులు ముగ్గురు. |



ఒకప్రక్క అగ్రకులాల వారు, మరో ప్రక్క అగ్రకులాల ఆధిపత్యం వున్న అధికార గణం. రెండింటి మధ్యన దళితులు నలిగిపోతున్నారు. ఒకరు దళితులపై దాడులకు పాల్పడితే మరొకరు బాధితులకు సాయం చేసే బదులు నిందితులను రక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో దళితులకు స్వరాజ్యం అంటే అర్థం ఏమిటి? అర్థం ఒకటే. యిప్పుడు కేవలం అధికార యంత్రాంగం మాత్రమే అగ్రకులాల వారి చేతుల్లో ఉంది. స్వరాజ్యంవస్తే శాసనాధికారం, కార్యనిర్వాహక అధికారం కూడా వాళ్ళ చేతుల్లోకి పోతుంది. ఈ పరిస్థితుల్లో స్వరాజ్యం కూడా దళితుల బాధలను మరింత పెంచుతుందని వేరే చెప్పనవసరంలేదు.

**- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్**

**దళిత, కవులకు, రచయితలకు / రచయిత్రులకు**

## ఆహ్వానం

**దళిత సాహిత్యం, అంబేడ్కరిజం, మొదలైన అంశాలపై తమ కవితలను, వ్యాసాలను, సాహిత్యాన్ని క్రింద తెలిపిన సాక్షి అడ్రస్‌కి పంపవలసిందిగా ఆహ్వానిస్తున్నాము.**

**సాక్షి**, మానవ హక్కుల నిఘా

**అత్యవసర సమాచారాన్ని అందించడానికి ఉచిత ఫోన్ నెంబరు వినియోగించుకోండి.**

**1800 4255535, 27737093**

**బి.ఎస్.ఎన్.ఎల్. నంబర్ల నుండి ఉచితంగా దళిత కాల్ లైన్‌కు ఫోన్ చేసి, రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న అత్యాచారాల గురించి సాక్షి మానవ హక్కుల నిఘాకు తెలుపవలసింది గా కోరు చున్నాము.**

**సాక్షి**, మానవ హక్కుల నిఘా

మీ అభిప్రాయాలను కింది చిరునామాకు పంపండి.


**సాక్షి** హ్యూమన్ రైట్స్ వాచ్, ఎ.పి.

**ఇం.నెం. 10-3-129, IInd ఫ్లోర్, టీచర్స్ కాలనీ, లేన్ నెం. 4, స్ట్రీట్ నెం. 3, ఈస్ట్ మారేడుపల్లి, సికింద్రాబాద్ - 500 026.**

**ఫోన్ : 040 - 65440969  ఫ్యాక్స్ : 040 - 27737086**

**ఇ-మెయిల్ :** Sakshi_ap@satyam.net.in  **వెబ్‌సైట్ :** www.sakshiap.org

**Toll Free Dalit Call No - 18004255535, 27737093**



Published by **V. Nanda Gopal,** Director, Sakshi Human Rights Watch, A.P. Secunderabad - 500 026.